ప్రజాశక్తి

గురువారం 28 నవంబర్ 2024

8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

సమావేశంలో మంత్రి నారాయణ తదితరులు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

మంత్రి నారాయణ ఆదేశం

నగరాభివృద్ధిపై విఎంసి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష

ప్రజాశక్తి - విజయవాడ : గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే విజయవాడలో కొన్నిచోట్ల తాగునీటి సమస్య ఉందని మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి నారాయణ బుధవారం సమీక్ష చేశారు. వీఎంసీ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులు, చేపట్టాల్సిన అభివద్ధి పనులతోపాటు ఇతర అంశాలపై చర్చించారు. విజయవాడ ఈస్ట్ ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, సెంట్రల్ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు, వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, కార్పొరేషన్ అధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. నగరంలోని పలు ప్రాంతాలకు సరిగా తాగునీరు అందడం లేదని ఎమ్మెల్యేలు మంత్రి దష్టికి తీసుకొచ్చారు. ఈ సమస్య పరిష్కారానికి కొన్నిచోట్ల మంచినీటి ట్యాంకులు నిర్మించాల్సి ఉందని అధికారులు తెలిపారు. వెంటనే ఆయా ట్యాంకుల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, అవసరమైన నిధులను వీఎంసీ సాధారణ నిధుల నుండి కేటాయించాలని ఆదేశించారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అమత్ పథకం నిధులు విడుదల (మిగతా 2లో)

బెల్ట్‌పై నిర్లక్ష్యం

● నామమాత్రంగానే చర్యలు ● 113 కేసులు, 114 మంది అరెస్టు ● 113 మందికి స్టేషన్ బెయిల్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని ప్రభుత్వం చెబుతున్న మాటలకు, ఆచరణకు పొంతన ఉండడంలేదు. ఆచరణలో అధికార యంత్రాంగం ఉదాసీనంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటి వరకు జిల్లాలో నమోదైన కేసులు, అరెస్టులు, స్టేషన్ బెయిళ్లను పరిశీలిస్తే ఈ విషయం తేటతెల్లమవుతుంది.

నూతన మద్యం విధానంలో భాగంగా కృష్ణాజిల్లాలో 123 ప్రయివేటు దుకాణాలకు లైసెన్స్‌లు మంజూరు చేశారు. అత్యధిక మండలాల్లో దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పడ్డారు. మద్యం విక్రయాల్లో కొందరు ప్రజాప్రతినిధులకు వాటాలిచ్చి వీధికో బెల్ట్‌షాపు ఏర్పాటు చేశారు. దీనిపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం కావడంతో ప్రభుత్వం స్పందించింది. బెల్ట్‌షాపుకు మద్యం సరఫరా చేసే లైసెన్స్ దుకాణదారునికి మొదటి విడత రూ.5 లక్షల జరిమానా, రెండోసారి కూడా పట్టుబడితే దుకాణం లైసెన్స్ రద్దు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. ఈనేపథ్యంలోనే అధికార యంత్రాంగం కదిలి బెల్ట్‌షాపుల నిర్వాహకులపై కేసులు నమోదు చేసింది. పోలీసులు కృష్ణాజిల్లాలో 113 కేసులు నమోదు చేసి 114 మందిని అరెస్టు చూపారు. అయితే 10 లీటర్లలోపు మద్యం దొరికిందనే కారణాన్ని చూపుతూ తీసుకుని 112 కేసుల్లో బెల్ట్‌షాపుల నిర్వాహకులకు స్టేషన్ బెయిల్ ఇచ్చారు. అంతేగాక ఈ బెల్ట్‌షాపులకు మద్యం సరఫరా చేసిన లైసెన్స్ దుకాణదారులను గుర్తించి సిఎం చంద్రబాబు, ఎక్సయిజ్ మంత్రి రవీంద్ర ప్రకటించిన విధంగా ఒకరిపైనా జరిమానాలు విధించలేదు.

కేవలం ఒక్కకేసులో మాత్రమే నిందితుడిని రిమాండ్‌కు పంపారు.

విస్తరిస్తున్న బెల్ట్‌షాపులు

ఇతర రాష్ట్రాల నుంచి మద్యం దిగుమతులు, నాటు సారా తయారీని నియంత్రించడంలోనూ గత ప్రభుత్వం తీసుకు వచ్చిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) విఫలమైందని చెబుతూ ఇటీవల ప్రొహిబిషన్ అండ్ ఎక్సయిజ్ శాఖను ప్రభుత్వం పునరుద్ధరించింది. జిల్లావ్యాప్తంగా 113 కేసులు నమోదు చేయగా, అత్యధికంగా మచిలీపట్నం సర్కిల్ పరిధిలో 18, మొవ్వ 17, గుడివాడలో 15 కేసులు నమోదు చేశారు. మొక్కుబడిగా ఇవ్వన్నీ స్టేషన్ బెయిల్ కేసులు కావడంతో ఎక్కడ బెల్ట్‌షాపులు అక్కడే తిరిగి కొనసాగుతున్నాయి. వ్యాపారాన్ని పెంచుకునేందుకు లైసెన్స్ మద్యం దుకాణదారులు సిండికేట్‌గా ఏర్పాటై బెల్ట్‌షాపులను విస్తరిస్తున్నారు.

ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వీరపాండ్యన్, కలెక్టర్ బాలాజీ

ధాన్యం రైతులు నష్టపోకుండా చర్యలు

రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండ్యన్

ప్రజాశక్తి-ఉయ్యూరు: ధాన్యం కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండ్యన్ అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, సంబంధిత అధికారులతో కలిసి ఉయ్యూరు మండలం చినఓగిరాల గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి ధాన్యం సేకరణ ప్రక్రియ పరిశీలించారు. రైతులతో మాట్లాడి ధాన్యం విక్రయంలో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతు సేవా కేంద్రంలో ధాన్యం తేమశాతం పరిశీలన, ఆన్లైన్లో నమోదు వంటి విషయాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా వీర పాండ్యన్ మాట్లాడుతూ వర్షం వచ్చే అవకాశాలున్నాయని వాతావరణ సూచనలు వచ్చినందున కోసి ఆరబెట్టిన ధాన్యం మిల్లులకు త్వరగా తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మిషన్లతో కోతలు జరుగుతున్నందున ఒకేసారి ఎక్కువ పరిమాణంలో మిల్లులకు వస్తుందని, ఇక్కడి మిల్లుల సామర్థ్యానికి మించి వస్తున్నందున, పక్క జిల్లాల మిల్లులకు పంపడానికి ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. అంతేకాకుండా ధాన్యం రవాణాకు వాహనాల కొరత నివారణకు అవసరమైన అదనపు వాహనాలు కూడా ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం లోకల్ (మిగతా 2లో)

4.3 గ్రాముల డ్రగ్స్ పట్టివేత

ఇద్దరు నిందితుల అరెస్టు

ప్రజాశక్తి - విజయవాడ : ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి పోలీసులు 4.3 గ్రాముల ఎండిఎంఎ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. కార్‌ను స్వాధీనం చేసుకున్నారు. విజయవాడ కృష్ణలంక పోలిస్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటు చేసుకుంది. సిఐ ఎస్ఎస్‌వి నాగరాజు కథనం ప్రకారం... విజయవాడ బస్‌స్టేషన్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న పులిచెర్ల శ్రీనివాసరెడ్డి, నందకోలా కిశోర్‌లను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 4.3 గ్రాముల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరిచారు. నిందితుడు శ్రీనివాసరెడ్డి విజయవాడ సత్యనారాయణపురంలోని ఘంటసాల సంగీత కళాశాల సమీపంలోని అపార్టుమెంట్లో నివశిస్తున్నాడు. గతంలో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశాడు. గతంలో కూడా డ్రగ్ కేసులో అరెస్టయి జైలుకెళ్లాడు. తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా వేంసురు గ్రామంలో వ్యవసాయ పనులు చేసే మరో నిందితుడు కిశోర్‌తోపాటు శ్రీనివాసరెడ్డి డ్రగ్స్ తీసుకొని విజయవాడ బస్‌స్టేషన్ సమీపంలో వేరే వారికి అమ్మడానికి వచ్చిన సందర్భంలో పోలీసులు అరెస్టు చేశారు. కేసు విచారణ జరుగుతోంది.

అజెండా అంశాలపై చర్చ జరిగేలా చూడండి

విఎంసి కౌన్సిల్‌పై సిపిఎం రాష్ట్ర నాయకులు దోనేపూడి కాశీనాథ్

వెయ్యి మంది కార్మికులను భర్తీ చేయాలి : ఫ్లోర్‌లీడర్ సత్యబాబు

మీడియాతో మాట్లాడుతున్న దోనేపూడి కాశీనాథ్; చిత్రంలో బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశాన్ని ప్రజాస్వామ్య పద్ధతిలో నిర్వహించి అన్ని అంశాలూ చర్చకు వచ్చేలా చూడాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ కోరారు. ఈనెల 29న విఎంసి కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం జరగనున్న నేపథ్యంలో కౌన్సిల్ నిర్వహణ, దాని అజెండా, చర్చించాల్సిన అంశాలు తదితర వాటిపై గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో ఆపార్టీ ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబుతో కలిసి బుధవారం విలేకరులతో మాట్లాడారు. ప్రశాంత వాతారణంలో అజెండాలోని ప్రతి అంశంపై సమగ్రంగా చర్చ జరిగే విధంగా కౌన్సిల్‌ను నిర్వహించాలని కోరారు. విజయవాడ నగరంలోని ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. అలాగే పరిష్కరించాల్సిన పలు సమస్యలు ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్నాయని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి విఎంసికి మంజూరు కావాల్సిన కోట్లాది రూపాయల వివిధ రకాల నిధులు, ఉద్యోగ, కార్మికుల సమస్యలు, నగరాభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రతి సభ్యుడు మాట్లాడే వాతావరణాన్ని అధ్యక్ష స్థానంలో ఉన్న నగర మేయర్ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాధాన్యత అంశాలపై ఎటువంటి చర్చ లేకుండా, అప్రజాస్వామిక పద్ధతిలో మొక్కుబడిగా కౌన్సిల్‌ను జరిపించాలనుకుంటే సిపిఎం చూస్తూ ఊరుకోదన్నారు. తమ ఫ్లోర్‌లీడర్ ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు. అప్రధాన అంశాలను సైతం రెడీ చేసి అప్పటికప్పుడు రెండో కంటికి కూడా తెలియనీయకుండా అత్యవసర అంశం (టేబుల్ ఐటమ్)గా తీసుకొచ్చి, ఆమోదించుకుందామనుకుంటే కుదరదని పేర్కొన్నారు. 174 ప్రతిపాదనలు, మరో 24 ప్రశ్నలతో రూపుదిద్దుకున్న కౌన్సిల్ అజెండాపై సమగ్రమైన చర్చ జరగాలని కోరారు. బుడమేరు, కృష్ణానది వరదలు భవిష్యత్తులో నగరాన్ని ముంచెత్తకుండా ఎసి మిత్రా కమిటీ సూచించిన డైవర్షన్ ఛానల్‌తో పాటు బుడమేరు కరకట్టకు రిటైనింగ్ వాల్ నిర్మాణంపై కౌన్సిల్‌లో (మిగతా 2లో)

అజెండాపై సమాధానాలకు సిద్ధం కండి

విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి

ప్రజాశక్తి-విజయవాడ : అజెండా అంశాలపై సభ్యులడిగే ప్రశ్నలకు జవాబు చెప్పే విధంగా ఆయా శాఖల అధికారులు సిద్ధం కావాలని విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి కోరారు. మేయర్ భాగ్యలక్ష్మి, బుధవారం విజయవాడ నగర పాలక సంస్థకు చెందిన వివిధ శాఖల అధికారులతో త్వరలో జరిగే కౌన్సిల్ ఎజెండాపై విఎంసి ప్రధాన కార్యాలయంలోని తన ఛాంబర్లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కౌన్సిల్ ఎజెండా, అదనపు ఎజెండాలో ఉన్న ప్రతి ప్రతిపాదనను ఆయా శాఖల అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరాభివద్ధి, ప్రజల సంక్షేమం కోసం సభ్యుల నుంచి వచ్చిన ప్రతిపాదనలను అధ్యయనం చేసి, వారికి సమాధానం చెప్పేవిధంగా అధికారులు సన్నద్ధం కావాలని కోరారు. ఈసమావేశంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథరెడ్డి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, చీఫ్ సిటీప్లానర్ జివిజిఎస్‌వి ప్రసాద్, డిప్యూటీ కమిషనర్ (రెవిన్యూ) సజన, సూపరింటెండింగ్ ఇంజనీర్లు సత్యనారాయణ, సత్య కుమారి, అకౌంట్స్ ఎగ్జామినర్ చక్రవర్తి, సెక్రటరీ వసంత లక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

30న కెఎల్ వర్సిటీ స్నాతకోత్సవానికి ఏర్పాట్లు

స్నాతకోత్సవం ఇన్విటేషన్‌ను మీడియాకు చూపుతున్న విసి డాక్టర్ జి.పార్థసారధి వర్మ, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ (విజయవాడ) : కోనేరు లక్ష్మయ్య (కెఎల్) డీమ్డ్ యూనివర్సిటీ 14వ స్నాతకోత్సవం ఈ నెల 30న వడ్డేశ్వరంలోని వర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఉప కులపతి డాక్టర్ జి.పార్థ సారధి వర్మ తెలిపారు. విజయవాడలోని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ స్నాతకోత్సవానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ముఖ్య అతిథిగా హాజరవుతారని, రాష్ట్ర గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, కమ్యునికేషన్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తదితర ప్రముఖులు గౌరవ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. దేశంలోనే అత్యున్నత అంతర్జాతీయ స్థాయి నాణ్యతా ప్రమాణాలు కలిగి ఎ ప్లస్ సర్టిఫికెట్ ఉన్న తమ వర్సిటీలో విద్యాభ్యాసం పూర్తి చేసిన విద్యార్థులు దేశ విదేశాల్లో రూ.57 లక్షల ప్యాకేజీ వేతనాలతో ఉద్యోగాలు సాధించి చరిత్ర సష్టించారని తెలిపారు. ఈ నేపథ్యంలో 2024 విద్యా సంవత్సరంలో విద్యాభ్యాసం పూర్తి చేసుకున్న 4,706 మంది విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేస్తారని తెలిపారు. వీరిలో 166 మంది పిహెచ్‌డి, 604 మంది పిజి, 3,9036 మంది అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులున్నారని పేర్కొన్నారు. గత విద్యా సంవత్సరంలో అత్యంత ప్రతిభ కనబరచిన 42 మంది విద్యార్థులకు బంగారు, 37 మందికి రజత పతకాలను, నగదు బహుమతులను అందించనున్నట్లు వర్మ చెప్పారు. తమ విద్యార్థులు ఆయా విభాగాల్లో సుమారు 170కి పైగా జాతీయ, అంతర్జాతీయ ప్రాజెక్టులను విజయవంతంగా పూర్తి చేశారని తెలిపారు. అందుకుగాను యుజిసి నుండి కెఎల్‌యుకు రూ.100 కోట్ల నిధులు కేటాయించారని పేర్కొన్నారు. తమ వర్సిటీలో 1200 మంది అత్యంత నిపుణులైన అధ్యాపకులు ఉండగా, వీరిలో 600 మంది వివిధ విభాగాల్లో డాక్టరేట్లు సాధించినవారేనని తెలిపారు. వర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు మాట్లాడుతూ వర్శిటీ అధ్యక్షులు కోనేరు సత్యన్నారాయణ స్నాతకోత్సవానికి అధ్యక్షత వహిస్తారని, తాను సంధాత కర్తగా, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం సమన్వయకర్తగా వ్యవహరిస్తామని తెలిపారు. మీడియా సమావేశంలో అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు, ఎం.హెచ్‌ఎస్, అంతర్జాతీయ సంబంధాల డీన్ కిషోర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏరీస్ 55వ వ్యవస్థాపక దినోత్సవం

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ సమీపంలోని సూరంపల్లి గ్రామంలో ఏరీస్ 55వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. సూరంపల్లి గ్రామంలోని ఏరీస్ కార్యాలయం వద్ద జరిగిన ఈ వేడుకల్లో విజయవాడ డిపోలో 300 మందికి అన్నదానం చేశారు. ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాల్లో ఏరీస్ సంస్థ వారు రైతు సదస్సులను నిర్వహించి పంటల్లో వచ్చే సమస్యలను, ఏరీస్ ఉత్పాదనల ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలు, రైతు సదస్సుల్లో 2 లక్షల మందికిపైగా అన్నదానం చేశారు. ఏరీస్ సౌత్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ జనరల్ (మార్కెటింగ్) జయప్రదీప్ సుబ్రమణియన్, ఏరీస్ ప్రతినిధులు ఎ.వెంకటేశ్వరరావు, అబ్దుల్ రెహ్మాన్ మాట్లాడారు.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు

- అథ్లెటిక్స్‌లో ఓవరాల్ ఛాంప్ తిరుపతి
- విజయవాడకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి - విజయనగరం టౌన్ : స్థానిక రాజీవ్ గాంధీ క్రీడా మైదానంలో మూడు రోజులపాటు జరిగిన విద్యుత్ ఉద్యోగుల అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ రాష్ట్ర క్రీడా పోటీలు బుధవారంతో ముగిశాయి. అథ్లెటిక్స్‌లో 100, 400, 800, 1000 మీటర్ల పరుగు పందెం, రిలే, లాంగ్ జంప్, హై జంప్, త్రోబాల్, డిస్కస్ త్రో, టేబుల్ టెన్నిస్‌లో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వమించారు. అథ్లెటిక్స్ విభాగంలో ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను తిరుపతి జిల్లా జట్టు సాధించింది. ద్వితీయ స్థానంలో విజయవాడ, మూడో స్థానంలో విజయనగరం జిల్లా జట్లు నిలిచాయి. విజేతలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్ సర్కిల్ డైరెక్టర్ రామచంద్ర ప్రసాద్, జనరల్ మేనేజర్ ఎస్.మాసిలామణి, విద్యుత్ శాఖ ఎస్ఇ ఎస్.లక్ష్మణరావు, ట్రాన్స్‌కో ఎస్ఇ బాలాజీ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వ్యక్తిగత పోటీల్లో మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచిన అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ విజేతలకు స్థానిక క్షత్రియ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో బహుమతులను అందజేశారు. డిసెంబర్లో జరిగే జాతీయ అథ్లెటిక్స్, టేబుల్ టెన్నిస్ పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేశారు. ఇదే స్ఫూర్తితో జాతీయ పోటీల్లో రాణించి రాష్ట్ర ఖ్యాతిని దేశవ్యాప్తంగా ఇనుమడింప చేయాలని అతిథులు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగుల క్రీడా కార్యదర్శి పి.త్రినాధరావు, క్రీడాధికారి వడివేలు పాల్గొన్నారు. ఇటీవల జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులను ముఖ్య అతిథులు సత్కరించారు.

విజయవాడ జట్టు

మొదటిపేజీ తరువాయి

అజెండాపై సమగ్రంగా చర్చ జరిగేలా చూడండి

చర్చించి, నిర్ణయం చేయాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రార్ధనాలయాలు, పాఠశాలలు, జనావాసాల మధ్య ఏర్పాటు చేసిన మద్యం షాపులతో ఘర్షణలు, అశాంతి, అల్లర్లు చోటుచేసుకుంటున్నాయని, ఇటువంటి మద్యం షాపుల లైసెన్స్‌లను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బెల్టు షాపులు కూడా విచ్చలవిడిగా పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందిగా తయారయిన మద్యం షాపులపై సమగ్రమైన చర్చ నడిపి, వాటిని రద్దు చేసే విధంగా నిర్ణయాలు చేయాలన్నారు. నగరానికి ఎంతో అవసరమైన, వరద ముంపు నివారణకు స్ట్రామ్ వాటర్ డ్రైనేజి స్కీమ్‌కు కేటాయించిన రూ.461 కోట్లలో ప్రభుత్వం దారి మళ్లించిన రూ.289 కోట్ల నిధులను మంజూరు చేయించి, ఆ స్కీమ్‌ను పూర్తయ్యేటట్లు కౌన్సిల్ చర్చించి తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపించాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సిపిఎస్ రూపంలో 760 మంది ఉద్యోగ, కార్మికులకు చెల్లించాల్సిన రూ.30 కోట్ల పెన్షన్ బకాయిలను వారి అకౌంట్లలో జమయ్యే విధంగా కౌన్సిల్ నిర్ణయం చేయాలన్నారు. అలాగే మూడు సంవత్సరాల కాలంలో విధుల్లో ఉంటూ మృతి చెందిన 36 మంది కార్మికులకు చెల్లించాల్సిన ఎక్స్‌గ్రేషియా, మంజూరు చేయాల్సిన ఇళ్లు, ఉద్యోగం తక్షణమే బాధిత కుటుంబ సభ్యులకు మంజూరు చేయాలన్నారు. వరద ప్రభావిత ప్రాంతమైన సింగ్‌నగర్‌లో వరదల సమయంలో విధుల్లోకి రాలేకపోయిన 1200 మంది అప్కాస్ కార్మికులతోపాటు మరో 45 మంది పర్మినెంట్ కార్మికులకు వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని కోరారు. వాటర్ సప్లై విభాగంలో ప్రతి సర్కిల్‌కు 50 మంది చొప్పున కార్మికులను భర్తీ చేయాలన్నారు. వాటర్ పైప్‌లైన్లు డ్రైనేజీలో కలుస్తున్నందున నగరంలోని ఆయా ప్రాంతాల్లో మురుగునీటినే తాగాల్సి వస్తోందని, పైప్‌లైన్ల మరమ్మతు పనులు చేసి, నగర ప్రజలందరికీ రక్షిత మంచినీటిని సరఫరా చేయాలని అన్నారు. రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్‌కనుగుణంగా నగరంలోని అంతర్గత రహదారులను విస్తరించడంతోపాటు ఫ్లైఓవర్లు, ఔటర్, ఇన్నర్ రింగ్ రోడ్లను నిర్మించాలన్నారు. రూ.263 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులను సక్రమంగా వినియోగించాలని కోరారు. సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు మాట్లాడుతూ... కౌన్సిల్ అజెండాలోకి 30 ప్రతిపాదనలు, మరో మూడు ప్రశ్నలను తమ పార్టీ తరుపున తీసుకొస్తున్నామని తెలిపారు. పెరిగిన పారిశుధ్యం పని భారానికనుగుణంగా వెయ్యి మంది కార్మికులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పార్కులు, గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలన్నారు. ఆహార పదార్థాలు కల్తీ కాకుండా ఎప్పటికప్పుడు ఆహార కల్తీనిరోధక శాఖ అధికారులు నగరంలో తనిఖీలు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కాలేదన్నారు. ఆ నిధులు వచ్చి ఉంటే విజయవాడలో తాగునీటికి కొరత ఉండేది కాదన్నారు. కార్పొరేషన్ పరిధిలో చేపట్టిన ఇంజనీరింగ్ పనులపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. అమత్ 1.0 పథకంలో చేపట్టిన పనులు ప్రస్తుతం ఏ దశలో ఉన్నాయి, వాటి పూర్తికి ఎంతమేర నిధులు అవసరం అవుతాయి అన్న విషయాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ నీటి కుళాయి కనెక్షన్ల వివరాలు, పూర్తి స్థాయిలో ప్రతి ఇంటికీ రక్షిత నీటి సరఫరాకు అవసరమయ్యే నిధుల వివరాల గురించి సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఆటోనగర్ ఇండస్ట్రియల్ ఏరియా పరిధిలోని గురునానక్ నగర్‌లో ఉన్న సుమారు 400 ఇళ్లకు తాగునీరు సరఫరా కావడంలేదని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్... మంత్రి దష్టికి తీసుకొచ్చారు. అయితే ఐలాతో ఉన్న సాంకేతిక పరమైన కారణాలతో కార్పొరేషన్ నుంచి మంచినీటి పైప్‌లైన్ ఇవ్వలేదనే విషయాన్ని మంత్రి దృష్టికి కమిషనర్ ధ్యానచంద్ర తీసుకెళ్లారు. ఆయా ఇళ్లకు వెంటనే మంచినీరు అందించేందుకు అవసరమైన పైప్‌లైన్లు నిర్మించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఇందుకుగాను సాంకేతిక పరమైన అవరోధాలు తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. బుడమేరు వరద కారణంగా పాడైన రోడ్లను కూడా త్వరగా నిర్మించాలని మంత్రి సూచించారు. వరద కాల్వల నిర్వహణ, సివరేజ్ వాటర్ డ్రెయిన్ల నిర్మాణంపైనా మంత్రి చర్చించారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు కొనసాగుతున్నాయని, సిల్ట్ తొలగింపు పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. వాంబే కాలనీలో ఉన్న కొంతమందికి ఇళ్ల పట్టాలు ఇవ్వాలనే అంశాన్ని ఎమ్మెల్యే బోండా ఉమా... మంత్రి దష్టికి తీసుకొచ్చారు. అసైన్డ్ భూముల్లో ఉన్న వాటికి ఇళ్ల పట్టాలిచ్చే అంశంపై వెంటనే ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌తో మంత్రి మాట్లాడారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. విజయవాడ సమగ్రాభివద్ధికి అవసరమైన చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని మంత్రి నారాయణ వివరించారు. త్వరలోనే ఇందుకు అవసరమైన నిధుల గురించి ముఖ్యమంత్రితో చర్చించి ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

ధాన్యం రైతులు నష్టపోకుండా చూడండి

వాహనాలు జిపిఎస్ లేకపోయినా ఆన్లైన్లో నమోదు చేసుకోవచ్చని తెలిపామని, ఆన్లైన్లో నమోదు చేయగానే, ధాన్యం రవాణా వాహనంగా వినియోగించుకుని, ట్రక్ షీట్ జనరేట్ అవుతుందని తెలిపారు. వర్ష సూచనలను బట్టి పొలంలో కోయకుండా ఉన్న పంటను కాపాడుకోవాలని రైతులకు సూచించినట్లు తెలిపారు. అనంతరం ఉయ్యూరు ఆర్డిఓ కార్యాలయంలో ధాన్యం కొనుగోలు అధికారులతో వీర పాండ్యన్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఉయ్యూరు ఆర్డిఓ షారోన్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ డి.సృజన, డీఎస్ఓ వి.పార్వతి, తాసిల్దారు సురేష్‌కుమార్, వ్యవసాయ శాఖ ఏవో నిస్సి గ్రేస్ తదితరులు పాల్గొన్నారు. **కంకిపాడు:** ప్రొద్దుటూరు టోల్‌గేట్ వద్ద ఉన్న బాలాజీ రైస్‌మిల్‌ను రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కార్యదర్శి వీరపాండ్యన్, జిల్లా కలెక్టర్ బాలాజీ సందర్శించారు. సేకరించిన ధాన్యం వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు మిషన్లతో కోత కోయించడం వల్ల ఒకేసారి ఎక్కువ పరిమాణంలో ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారని, మిల్లు కెపాసిటీ బట్టి ధాన్యం ప్రొక్యూర్ చేసినట్లు మిల్లర్ కలెక్టర్‌కు వివరించారు. గ్రామాల వారి ధాన్యం దిగుబడి అంచనాలను బట్టి ఆ గ్రామానికి కేటాయించిన మిల్లు సామర్థ్యాన్ని బట్టి ధాన్యం పంపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

గ్రామ పంచాయతి కార్యాలయం, బాహుబలేంద్రునిగూడెం

వేలం ప్రకటన

ఆర్ఓసి నెం.12/2024 **తేది: 26-11-2024**

కృష్ణాజిల్లా, గన్నవరం మండలం, బాహుబలేంద్రునిగూడెం గ్రామ పంచాయతిలో గల పాత గ్రామ పంచాయతి కార్యాలయ భవనమును తొలగించుటకు మరియు తొలగింపు ఫలితముగా వచ్చు సామాగ్రిని తీసుకోని వెళ్ళు నిమిత్తం ది: 02-12-2024 సోమవారం ఉదయం 11 గంటలకు బాహుబలేంద్రునిగూడెం గ్రామ పంచాయతి కార్యాలయం వద్ద బహిరంగ వేలంపాట నిర్వహించబడును. కావున వేలంపాటలో పాల్గొనదలచినవారు ఈ క్రింది తెల్పిన వివరములు మరియు షరతులకు లోబడి వేలంపాటలో పాల్గొనవలసినదిగా తెలియపరచటమైనది.

వ సం	వివరము	చెల్లించవలసిన ధరావత్తు
1	పాత గ్రామ పంచాయతి కార్యాలయ భవనమును తొలగించుటకు మరియు తొలగింపు ఫలితముగా వచ్చు సామాగ్రిని తీసుకోని వెళ్ళుట	2500

షరతులు:
1. వేలంపాటదారుడు వేలంపాట మొత్తమును పాటకాయపరచిన వెంటనే చెల్లించవలెను.
2. వేలంపాటదారుడికి వచ్చు లాభనష్టములకు కష్టనష్టములకు గ్రామ పంచాయతి వారికీ ఏ విధమైన సంబంధం లేదు.
3. వేలంపాటదారుడు వేలం కాయపరచిన తేది నుంచి 7 దినములలోపు మెటీరియల్, వగైరాలను తొలగించి వెంటనే వేలంపాట ప్రదేశమును ఖాళిచేయవలెను.
4. ఇతర ఏ విషయమైనను గ్రామ పంచాయతి వారిదే తుది నిర్ణయము.

డి.జయలక్ష్మి
సర్పంచ్
బాహుబలేంద్రునిగూడెం గ్రా, పం,

ఎన్.శివనాగరాజు
పంచాయతీ కార్యదర్శి
బాహుబలేంద్రునిగూడెం గ్రా.పం.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం సమీపంలోని వియన్ పురం వెళ్లే రోడ్డులో నిర్మించనున్న అయోధ్య అపార్ట్మెంట్ భవన సముదాయం వద్ద పెండింగ్ వేతనాల కోసం కార్మికులకు బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ 2018 నుండి 2020 వరకు అపార్ట్మెంట్ యజమాని వేణు దగ్గర నిర్మాణ పనులకు వచ్చామని, ఆ సమయంలో సక్రమంగా వేతనాలు చెల్లించకుండా నిలుపుదల చేశారని చెప్పారు. ఆ బకాయిలు 3కోట్ల కు పైగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ బకాయిల కోసం ఎన్నిసార్లు కాంట్రాక్టర్ వద్ద మొరపెట్టుకున్న వినకపోవడంతో రోడ్డెక్కి ఆందోళన చేయాల్సి వచ్చింది అన్నారు. మా డబ్బులు మాకిమ్మని అడుగుతుంటే మమ్మల్ని బెదిరిస్తున్నారు అంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబ్బుల కోసం లేబర్ కోర్టులో కేసు వేశామని, అయినా భవన యజమాను నుంచి స్పందన లేదన్నారు. ఈ ఆందోళన విషయం తెలుసుకున్న గన్నవరం పోలీసులు రంగంలోకి దిగారు. లేబర్ కాంట్రాక్టర్ తో పాటు, అపార్ట్మెంట్లో పనిచేస్తున్న ఇంజనీర్లను పోలీస్ స్టేషన్ కు తీసుకువెళ్లి మాట్లాడారు. లేబర్ కోర్టులో కేసు వేశారని, అపార్ట్మెంట్ కు సంబంధించిన వేణు అనే వ్యక్తి నుంచి డబ్బులు రావాల్సి ఉందని ఇంజనీర్లు పోలీసులకు తెలిపారు. ఏదైనా విషయం ఉంటే కోర్టులో తెలుసుకోవాలని, అనవసరంగా రోడ్లు బంద్ చేస్తే చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. కార్మిక సంఘాల నాయకులు పాల్గొని భవన నిర్మాణ కార్మికులకు రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరారు.

డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం దళితవాడలో మురుగు సమస్య పరిష్కారానికి డ్రైనేజీలు ఏర్పాటు చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు రాచేటి మురళి ఆధ్వర్యంలో ఎండిఒకు వినతిపత్రం సమర్పించారు. దళితవాడ ఏరియాలో డ్రైనేజీలు లేకపోవడం వల్ల మురుగునీరంతా రోడ్డుపై ప్రవహిస్తుందని, దోమలు పెరిగి ఇండ్లలో రోగాలు పెరుగుతున్నాయని చెప్పారు. రోడ్ల పరిస్థితి సరిగా లేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం: సాయం చేసే గుణం చాలా గొప్పదని సిపిఎం నాయకులు బర్రె లెనిన్ అన్నారు. బాపులపాడు మండలం బండారుగూడెం గ్రామంలో డిజిటల్ అసిస్టెంట్ జ్యోతి కుమార్తె సిరిజ పుట్టినరోజు సందర్భంగా 30 మందికి వద్ధులకు దుప్పట్లు పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. లెనిన్ మాట్లాడుతూ పుట్టిన రోజుల పేరుతో ఫంక్షన్లు చేసి హడావుడి చేయడం కన్నా సాధారణంగా ఇంట్లో జరుపుకోవడం మంచిదన్నారు. కొంత డబ్బుతో పేదలకు సహాయం అందించే కార్యక్రమాలు చేయాలన్నారు. జ్యోతిని అభినందించారు.

ఉన్నత విద్యతోనే ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్: కష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం పరిశోధన విద్యార్థి సాధిక్ అహ్మద్ మహమ్మద్ పిహెచ్‌డి వైవ ఓస్ ఎగ్జామినేషన్ సందర్భంగా ఎక్స్టర్నల్ ఎగ్జామినర్‌గా విచ్చేసిన ప్రఖ్యాతిగాంచిన ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ బి.బిరయ్య సిఎస్ఐఆర్ ల్యాబ్ రోటరీలలో భవిష్యత్తు అనే అంశంపై మాట్లాడారు. ఎమ్మెస్సీ తర్వాత విద్యార్థులంతా తమ ఉన్నత విద్యా నిమిత్తం సిఎస్ఐఆర్, గేట్ వంటి అర్హత పరీక్షలు రాసి ప్రఖ్యాతిగాంచిన విద్యాసంస్థల్లో పరిశోధనలు చేయాలని ఆయా పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. నేటి యువత వీలైనంత తొందరగా ఉద్యోగాలు సంపాదించాలి అన్న ఆత్రుతతో తమ విద్యను ఎమ్మెస్సీతోనే ఆపివేస్తున్నారని అలా కాకుండా ఉన్నత విద్యలు అభ్యసించడం ద్వారా అత్యుత్తమ భవిష్యత్తును కలిగి ఉంటారని తన ప్రసంగంలో తెలిపారు. అలాగే గ్రీన్ కెమిస్ట్రీ 12 నియమాలను ప్రస్తుత సమాజానికి అన్వయిస్తూ వివిధ ఉదాహరణలతో చాలా చక్కగా ఉపన్యసించారు. పరిశోధనలతోనే ఏ దేశ భవిష్యత్తు అయిన ఆధారపడి ఉంటుందని భారత దేశ బంగారు భవిష్యత్తుకు భారతదేశ పరిశోధనలు మూలమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రసాయన శాస్త్ర విభాగ విభాగాధిపతి డాక్టర్ డి.రామ్‌శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టాల పట్ల బాలికలకు అవగాహన

ప్రజాశక్తి-గన్నవరం: బాలికలు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని గన్నవరం కోర్టు న్యాయమూర్తి జయలక్ష్మి అన్నారు. బుధవారం గన్నవరం మండలం దావాజీ గూడెం లోని బాలికల వసతి గహంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. జయలక్ష్మి మాట్లాడుతూ బాలికలకు చాలా హక్కులు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు. సమాజంలో వస్తున్న మార్పులను, చట్టాలను ఆకలింపు చేసుకోవాలన్నారు. బాలికలను ఎవరైనా వేధిస్తే చట్టం ద్వారా రక్షణ పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

పిటిషన్ కొట్టివేత

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా): బ్యాలెట్ పేపర్ల ద్వారా దేశంలో ఎన్నికలు జరిపించాలని కోరుతూ సుప్రీం కోర్టులో దాఖలైన ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని కోర్టుకొట్టివేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వివేక్‌యాదవ్ పూర్తి వివరాలతో కూడిన ప్రకటన విడుదల చేసినట్లు పేర్కొన్నారు. మత ప్రచారకుడు డా.కె.ఎ. పాల్ దాఖలు చేసిన ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ పి.బి.వరలెలతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసినట్లు వెల్లడించారు. వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ఈ.వి.ఎం.టాంపరింగ్ కు గురవుతున్నాయని పలు రాజకీయ పార్టీల నాయకులు మాట్లాడుతున్న విషయాన్ని పిటిషనర్ డా. పాల్ ప్రస్తావించగా, జస్టిస్ విక్రమ్ నాథ్ ఈ విషయమై మాట్లాడుతూ "ఎన్నికల్లో తాము గెలిస్తే ఈవిఎంలు ట్యాపరింగ్ కాలేదని, ఎన్నికల్లో ఓటమి పాలైతే ట్యాపరింగ్ జరిగిందని కొన్ని రాజకీయ పార్టీలు వ్యాఖ్యానించడం పరిపాటిగా మారిందని పేర్కొన్నట్టు తెలిపారు.

యుటిఎఫ్ నాయకురాలు ఝాన్సీలక్ష్మి మృతి

ప్రజాశక్తి-గన్నవరం: యుటిఎఫ్ నాయకురాలు, రిటైర్డ్ టీచర్ కె.ఝాన్సీలక్ష్మి (65) బుధవారం అనారోగ్యంతో మరణించారు. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యుటిఎఫ్ నేతలు మరీదు వరప్రసాద్, సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, మండల నాయకులు అనుమోలు వెంకటేశ్వరరావు, ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకటరావు, యుటిఎఫ్ నాయకులు రాజబాబు, రవిబాబు తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. టీచర్‌గా పని చేసిన కాలంలో యుటిఎఫ్ బలోపేతానికి ఝాన్సీలక్ష్మి ఎంతగానో కృషి చేశారని,ఆమె భర్త కర్రా వరప్రసాద్ యుటిఎఫ్ నాయకునిగా సంఘం బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని నాయకులు చెప్పారు.

బెంగుళూరు వెళ్లిన షర్మిల

ప్రజాశక్తి-గన్నవరం: విజయవాడ నుంచి రోడ్డు మార్గాన గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏపీ పీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల బుధవారం చేరుకున్నారు. అనంతరం ఇండిగో విమానంలో బెంగుళూర్ బయలుదేరి వెళ్లారు.

గురజాడ వర్ధంతి

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు: అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో గురజాడ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక ఇందిరానగర్‌లో జరిగిన సమావేశంలో సీఐటియు మండల అధ్యక్షురాలు మేకల జయలక్ష్మి, సెక్టార్ లీడర్ అమ్మాజీ గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కవుతరం చెరువు గట్టుపై ఉన్న సెంటర్‌లో జరిగిన సమావేశంలో సెక్టర్ నాయకులు గరికిపాటి విజయలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు శ్రీనివాసరావు గురజాడపై కవిత చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో గుడ్లవల్లేరు నాయకులు మౌనిక గ్రేస్, రజని, ధనలక్ష్మి, మంజుల, దేవకరుణ తదితరులు పాల్గొన్నారు.

తేమ ఉన్నా ధాన్యం కొనుగోలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు తేమ శాతం ఉన్న ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తామని మండల తాసిల్దార్ లోకరాజు అన్నారు. వాతావరణం రైతులను ఆందోళనకు గురి చేస్తున్న నేపథ్యంలో రైతులు భయపడాల్సిన అవసరం లేదని తేమశాతం ఉన్న ధాన్యాన్ని కూడా సేకరిస్తామని తెలిపారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ రైతులు పండించిన ధాన్యాన్ని జిపిఎస్ లేని వాహనాల ద్వారా కూడా మిల్లులకు ధాన్యాన్ని తరలించవచ్చని అన్నారు. గోను సంచులు మండలంలోని ప్రతి ఆర్ఎస్‌కె కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వాతావరణం ఇబ్బందికరంగా ఉన్న కారణంగా రైతులు రోడ్లపై చేర్చిన ధాన్యాన్ని ప్రభుత్వం సంచులు ఏర్పాటు చేసి వాహనాలపై రైస్ మిల్లులకు తరలించే ఏర్పాట్లు కూడా చేసినట్టు తెలిపారు. ఎవరికైనా ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఉంటే తాసిల్దారును సంప్రదించాలని తెలిపారు.

జాతీయ సదస్సుకు హాజరుకానున్న మండలి

ప్రజాశక్తి-అవనిగడ్డ: రాష్ట్రేతర తెలుగు సమాఖ్య వార్షిక సమావేశాల జాతీయ సదస్సు ఈ నెల 30, డిసెంబర్ 1 తేదీలలో షిర్డీ నగరంలో జరగనుంది. ఈ సదస్సులో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాదు పాల్గొంటున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధి తెలిపారు. భాష సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారని, రాష్ట్ర ఇతర తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో షిరిడి పట్టణంలో హోటల్ శాంతి కమలహాల్లో తెలుగు ప్రతినిధుల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ధాన్యం సేకరణలో ఇబ్బందుల్లేకుండా చూడాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గూడూరు: ధాన్యం సేకరణలో రైతుల, మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలని రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ బుధవారం గూడూరు మండలం రాయవరం అడ్డరోడ్డు వద్ద ధాన్యం ఆరబెట్టిన రైతులతో మాట్లాడి ధాన్యం విక్రయంలో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు మాగంటి బాపూజీ, రంగబాబు, నాగమల్లేశ్వరరావు తదితరులు ఈనెల 25న కోత కోశామని, గూడూరు మండలంలో దగ్గర్లో మిల్లులకు ధాన్యం తోలామని, అయితే ఆన్లైన్ ఇంకా చేయలేదని తెలుపగా, కలెక్టర్ సంబంధిత మిల్లుల కస్టోడియన్ అధికారులతో మాట్లాడి వెంటనే ఆన్లైన్ చేయించాలని రెవిన్యూ సిబ్బందిని ఆదేశించారు.అనంతరం జిల్లా కలెక్టర్ గూడూరు మండలంలోని తరకటూరుపాలెంలో గోమతి రైస్ మిల్ ఆకస్మికంగా సందర్శించి ధాన్యం సేకరణ గురించి మిల్లర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు మిషన్లతో కోత కోయించడం వల్ల ఒకేసారి ఎక్కువ పరిమాణంలో ధాన్యం మిల్లులకు తరలిస్తున్నారని, మిల్లు కెపాసిటీ బట్టి ధాన్యం స్వీకరిస్తున్నామని, ఎక్నాలెడ్జ్మెంట్ పెండింగ్ లేదని తెలిపారు. బ్యాంకు గ్యారంటీ రెండున్నర కోట్లు కాగా, ఇప్పటి వరకు 80 లక్షల విలువైన ధాన్యం ప్రొక్యూర్ చేసినట్లు మిల్లర్ కలెక్టర్ కు వివరించారు. కష్టం మిల్లింగ్ డెలివరీ చేస్తున్నారా అని ప్రశ్నించడంతో, వెబ్సైట్ సమస్య ఉందని, వెబ్ సైట్ ఓపెన్ కాగానే బియ్యం ఉత్పత్తి ప్రారంభిస్తామని మిల్లరు తెలిపారు. సంబంధిత రెవిన్యూ అధికారులు,మండల వ్యవసాయాధికారి ఆంజనేయ కుమార్ కలెక్టర్ వెంట ఉన్నారు.

రాజ్‌కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పల్లంరాజు, ఆకుల శ్రీనివాస్

ఆకుల కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - భవానీపురం : రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్‌ను కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు బుధవారం భవానీపురంలోని ఆయన స్వగృహంలో కలిసి ఓదార్చారు. మనోధైర్యంగా ఉండాలని కోరారు. డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలిపారు. మాజీ పీసీసీ అధ్యక్షులు ఎన్.రఘువీరారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొలనుకొండ శివాజీ, నరహరశెట్టి నరసింహారావు తదితరులు పరామర్శించారు.

రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కృష్ణ తదితరులు

సిమెంట్ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక 45వ డివిజన్‌లోని బృందావన్ కాలనీలో రూ.19.70 లక్షలతో సిమెంట్ రోడ్డును నిర్మిస్తున్నట్లు 45వ డివిజన్ టిడిపి నాయకులు మైలవరపు కృష్ణ చెప్పారు. రోడ్డు నిర్మాణ పనులను కృష్ణ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 45 డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, విజయవాడ పశ్చిమ ఎంఎల్‌ఎ సుజనా చౌదరి మార్గదర్శకత్వంలో డివిజన్ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రోడ్డు కాంట్రాక్టర్ తిరుపాల్‌రావు, సచివాలయం సెక్రటరీ బుచ్చిబాబు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

మరుపిళ్ల చిట్టి జయంతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్వాతంత్ర్య సమరయోధులు, పేద బడుగు వర్గాల ఆశాజ్యోతి, కార్మికనేత పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కీర్తిశేషులు సర్దార్ మరుపిళ్ళ చిట్టి 127వ జయంతి వేడుకలు బుధవారం కొత్తపేటలో సర్దార్ శ్రీ మరుపిళ్ళ చిట్టి కార్యాలయంలో కార్యాలయ అధ్యక్షులు పోతిన బేసికంటేశ్వరుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జెండాను పోతిన వెంకటేశ్వరరావు ఎగరవేశారు. చిట్టి చిత్రపటానికి నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పూజా కార్యక్రమం నిర్వహించి, కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం, వస్త్రాలు, పుస్తకాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుల పర్సనల్ సెక్రటరీ ప్రత్తిపాటి శ్రీధర్, బిజెపి జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, టీడీపీ నాయకులు ఎంఎస్ బేగ్, నగరాల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాయన బాబూజీ (బాబ్జి) వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ధృవీకరణ పత్రం ఇక సులభతరం

ప్రజాశక్తి - కంచికచర్ల : గతంలో ఇచ్చిన ధృవీకరణ పత్రం ద్వారా కొత్తగా కమ్మర్లకు కుల ధృవీకరణ పత్రం ఇవ్వనున్నట్లు తహశీల్దార్ జాహ్నవి తెలిపారు. ఆర్‌డిఒ ఆదేశాలతో ధృవీకరణ పత్రం కోసం రెవెన్యూ అధికారులతో తహశీల్దార్ విచారణ చేయించారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసిల్లో 50 సంవత్సరాలు వయసు దాటిన వారికి సామాజిక పెన్షన్ ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలతో కుల ధ్రువీకరణ పత్రం ఆవశ్యకత పెరిగింది. కంచికచర్లకు చెందిన కొంతమంది కమ్మర కులస్తులు కుల ధృవీకరణ పత్రం కోసం దరఖాస్తు చేశారు. గతంలో వీరందరూ కలెక్టర్, తహశీల్దార్‌ల ద్వారా ధృవీకరణ పత్రాలు పొందారు. మరల ప్రభుత్వం ధృవీకరణ పత్రాలు అడగటంతో ఈ సమస్యపై తహశీల్దార్‌కు ఆర్‌డిఒ రిఫర్ చేయగా ఆమె విచారణకు ఆదేశించారు. బుధవారం సాయంత్రం విఆర్‌ఓ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లతో విచారణలో భాగంగా అన్నీ పరిశీలించి కుల ధృవీకరణ పత్రాలు పొందొచ్చని స్పష్టం చేశారు.

ధాన్యం తడవకుండా చూడాలి : జెసి నిధి మీనా

ప్రజాశక్తి - తిరువూరు : ఒక్క ధాన్యం గింజ కూడా తడవకుండా, ప్రతి రైతు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లేలా చర్య లు తీసుకోవాలని రెవెన్యూ, సివిల్ సప్లయ్, వ్యవసాయ శాఖల అధికారులకు జాయింట్ కలెక్టర్ నిధి మీనా ఆదేశాలిచ్చారు. తుఫాన్ ముంచుకొస్తున్న వేళ రైతు లను అధికారులను అప్రమత్తం చేసేందుకు జాయింట్ కలెక్టర్ బుధవారం తిరువూరు మండలంలోని వావిలాల తదితర గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, రైతులు ఆరబెట్టుకున్న ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం తిరువూరు శ్రీ వాహినీ ఇంజనీరింగ్ కళాశాలలో రెవెన్యూ, సివిల్ సప్లయ్, వ్యవసాయ శాఖల అధికారులతో, సిబ్బందితో ధాన్యం కొనుగోలు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. తుఫాన్ దష్టిలో పెట్టుకొని కోతకు వచ్చిన ధాన్యాన్ని కోయించి వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేలా రైతులను చైతన్యం చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు. అంతకుముందు జేసి తిరువూరు రైతుబజారులో అధిక ధరలపై ఫిర్యాదులు రావడంతో వినియోగదారులను జెసి విచారించారు. స్టాల్స్ వద్ద ధరల పట్టిక సక్రమంగా నిర్వహించట్లేదని, ప్రభుత్వం సబ్సిడీపై అందించే టమాటా, నూనె విక్రయాలకు సంబంధించిన స్టాకు రిజిస్టర్లు లేవని గుర్తించారు. ఎస్టేట్ అధికారి అందుబాటులో లేకపోవడంతో జేసీ అడిగిన ప్రశ్నలకు స్టాల్స్ నిర్వాహకులు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పౌరసరఫరాల డీటీ శ్వేతపై జేసీ అసహనం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మాధురి, తహశీల్దార్ జి.లక్ష్మి, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు, జిల్లా పౌరసర ఫరాల మేనేజరు సతీష్, మార్కెటింగ్, సహకార శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యం పరిశీలిస్తున్న జెసి నిధి మీనా

సితార రోడ్లో ఫుడ్‌కోర్టు వద్దు

ప్రజాశక్తి - భవానీపురం : స్థానిక సితార సెంటర్ బైపాస్ రోడ్డు సమీపంలో ఫుడ్ కోర్టు ఏర్పాటును విరమించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేశారు. ఫుడ్‌కోర్టు వద్దంటూ నినాదాలు చేశారు. ఫుడ్ కోర్టును వ్యతిరేకిస్తూ బుధవారం బైపాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో స్థానిక నివాసిత ప్రాంతాల నాయకులు పరిమి మల్లేశ్వరరావు, కటకం రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఫుడ్ కోర్ట్ ఏర్పాటు వల్ల ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. చుట్టూ నివాసిత ప్రాంతాలు ఉన్నందున స్థానికులకు ఇది ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే నిత్యం ఈ రోడ్డుపై ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు చేస్తే ప్రమాదాల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ ఫుడ్‌కోర్ట్ ఏర్పాటు ప్రతిపాదన వెంటనే విరమించాలని కోరారు. 1976లో బైపాస్ రోడ్డును 200 అడుగుల వెడల్పుతో గొల్లపూడి నుంచి సితార సర్కిల్ వరకు అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. బైపాస్ రోడ్డును 200 అడుగుల వెడల్పున అభివృద్ధి చేయనందు వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ బైపాస్ రోడ్డునకు ఇరువైపులా ఓపెన్ డ్రైన్‌లను ఏర్పాటు చేసి రోడ్డును అభివృద్ధి చేయాలని కోరారు. ఈ విషయాన్ని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), పశ్చిమ ఎంఎల్‌ఎ సుజనా చౌదరి, విఎంసి కమిషనర్, స్థానిక కార్పొరేటర్ మైలవరపు మాధురి లావణ్య దృష్టికి కూడా తీసుకెళ్లనున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో రాంపిళ్ల వెంకటరమణ, బాలాజీ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు రమేష్, అల్లు మధు, మల్లంపాటి కొండలరావు, దేవరపు సూర్యనారాయణ, బోనం వెంకటయ్య, రావెళ్ల నాగేశ్వరరావు, సామా వెంకటస్వామి, కె. విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో ఫుడ్‌కోర్టు నిర్మాణం వద్దంటూ నినదిస్తున్న స్థానికులు

శాటిలైట్ కార్యాలయ ఉద్యోగి ఫరీద్‌కు సత్కారం

ప్రజాశక్తి - తిరువూరు : విధి నిర్వహణలో ప్రజలందరి హృదయాలను గెలుచుకున్న ఉద్యోగుల్లో ఫరీద్ బాబు ఒకరని ఎల్‌ఐసి డెవలప్మెంట్ ఆఫీసర్లు, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ (క్లియా), ఏజెంట్లు అభినందించారు. అకౌంట్ అసిస్టెంట్ ఆఫీసర్ (ఏఏఓ)గా ఎల్‌ఐసి తిరువూరు శాటిలైట్ కార్యాలయంలో మూడు సంవత్సరాలుగా పనిచేసి బదిలీపై మచిలీపట్నం డివిజినల్ కార్యాలయానికి వెళ్తున్న ఫరీద్ బాబును బుధవారం తిరువూరు ఆఫీసులో మేనేజర్, సిబ్బంది, డెవలప్‌మెంట్ ఆఫీసర్స్, క్లీయా, ఏజెంట్స్ పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించారు. ఫరీద్ బాబు ఇక్కడ నుండి వెళ్లడం బాధగా ఉన్నప్పటికీ వృత్తి రీత్యా బదిలీ అవటం సంతోషంగా ఉందని ఏజెంట్లతో పాటు మేనేజర్ రమేష్ తెలిపారు. గెలాక్సి క్లబ్ సభ్యులు మల్లెలి రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, శివరామకృష్ణ, మహేంద్ర, షారోను, చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్లు జి.రామకృష్ణారెడ్డి, ఎల్.సురేష్, సీనియర్ ఏజెంట్లు జొన్నాడ సత్యనారాయణ, పంతంగి శ్రీనివాసరావు, శ్రీనివాసులు, మామిడి రామకృష్ణ గొల్లమందల రవి, చెరుకు జగన్, గంటా ఏడు కొండలు తదితరులు మాట్లాడారు.

ఫరీద్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తూ డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు న్యూ ఆర్.ఆర్ పేట, అజిత్ సింగ్‌నగర్‌లో కొండ్ర ఆకాష్‌కుమార్ దినేష్ (20) కుటుంబం నివాసం వుంటుంది. అదే ప్రాంతంలో నివసించే షేక్ సుభాన్, కొండ్ర ఆకాష్‌కుమార్ దినేష్ ఇద్దరూ స్నేహితులు. కొండ్ర ఆకాష్‌కుమార్ దినేష్ ఇంటర్ వరకు చదివి ఈవెంట్స్‌లో ఫొటోగ్రాఫర్‌గా చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఆకాష్‌కుమార్ దినేష్ తన స్నేహితునితో కలిసి ద్విచక్రవాహనంపై చనుమోలు వెంకట్రావు ఫ్లైఓవర్ క్రింద వెళ్తున్నాడు. మార్గమధ్యలో బైకు అదుపుతప్పి గుంతలో పడగా ఆకాష్‌కుమార్ డివైడర్ మధ్యలో ఉన్న మొక్కలకు గుద్దుకున్నాడు. దీంతో నుదురు భాగం పగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. సుభాన్‌కు తీవ్ర గాయాల య్యాయి. సమాచారం అందుకున్న టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆకాష్‌కుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం హెల్ప్ ఆసుపత్రికి తరలించారు. షేక్ సుభాన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని మృతిచెందిన కొండ్ర ఆకాష్‌కుమార్ దినేష్ మృతదేహం

దుర్గమ్మను దర్శించుకున్న సరస్వతి స్వామీజీ

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీశ్రీశ్రీ గోవింద నంద సరస్వతి స్వామీజీ, కర్ణాటక పంపాక్షేత్ర సాధకులు, ద్వారక, బద్రి, జ్యోతిష్ పీఠం శిష్యులు దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు వేద పండితులు, డిప్యూటీ ఇఒ రత్నరాజు అర్చక స్వాములు ఘన స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనం అనంతరం చిత్రపటం స్వీకరించి వివిధ గ్రంథాలపై ఉపన్యసించారు.

వయోజన విద్యపై అవగాహన

ప్రజాశక్తి - గంపలగూడెం : చదువుతోనే విషయ పరిజ్ఞానం వస్తుందని గంపలగూడెం ఎంపిడిఒ ఎం.చెన్నయ్య తెలిపారు. ఐకెపి కార్యాలయంలో స్వయం సహాయక సంఘాలకు వయోజన విద్యపై అవగాహన కల్పించారు. ప్రతి ఏడాది ఆయా గ్రామాల్లో 18 నుండి 50 సంవత్సరాల లోపు చదవడం రాయడం రానివారికి ఆరు నెలల పాటు వాలంటీర్ల ఏర్పాటుతో చదువు నేర్పటం జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఇకనుండి ఈ అంశాలను తూచా తప్పకుండా అమలు చేయాల్సి ఉంటుందని ఎంపిడిఒ ఆదేశించారు. ఈ కార్యక్రమాలు ఐసిడిఎస్ సూపర్వైజర్ ముని లక్ష్మి, ఐకెపి ఎపిఎం గురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ. 3.80 కోట్లు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి మహా మండపం ఆరవ అంతస్తులో బుధవారం హుండీలు లెక్కించారు. నగదు రూపంలో రూ. 3,80,77,021లు, బంగారం: 559 గ్రాములు, వెండి: 7 కేజీల 020 గ్రాములు భక్తులు కానుకల రూపంలో సమర్పించారు. యుఎస్‌ఏ– 615 డాలర్లు, ఆస్ట్రేలియా – 55 డాలర్లు, కువైట్ – 7 దినార్లు, ఖతార్ – 27 రియాల్స్, యుఏఇ – 110 దిర్హమ్స్, మలేషియా – 33 రింగేట్లు, సౌదీ – 19 రియాల్స్, ఇంగ్లాండ్ – 30 పౌండ్లు, యురప్ – 10 యూరోలు, కెనడా – 25 డాలర్లు, ఒమాన్ – 0.5 రియాళ్, సింగపూర్ – 10 డాలర్లు సమర్పించారు. ఆలయ ఇఒ కె.ఎస్. రామారావు, డిప్యూటీ ఇఒ ఎమ్.రత్న రాజు, దేవాదాయ శాఖ అధికారులు, ఏఈఓలు, ఆలయ సిబ్బంది, ఎస్‌పిఎఫ్, వన్‌టౌన్ పోలీసు సిబ్బంది, అమ్మవారి సేవాదారులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

వార్షికోత్సవ తనిఖీలు

ప్రజాశక్తి - జి కొండూరు : వార్షిక తనికెల్లో భాగంగా జి కొండూరు పోలీస్ స్టేషన్‌ను రూరల్ డిసిపి కేఎం మహేశ్వర్ రాజు సందర్శించి తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు పరిశీలించి దర్యాప్తులో ఉన్న వివిధ కేసుల వివరాలడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్లో ఉన్న రికార్డులతో పాటు కేసుల పరిష్కారం స్టేషన్ ఆవరణ నిర్వహణ, సిబ్బంది పనితీరును ఆరాతీశారు. ఈ సందర్భంగా డిసిపి మహేశ్వర రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు కూడా సైబర్ మోసాలు పట్ల మన సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎసిపి ప్రసాదరావు, మైలవరం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.చంద్రశేఖర్, జి.కొండూరు ఎస్ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడలో సిఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

సిఎంఆర్ షాపింగ్ మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాము, విలేకరులతో మాట్లాడుతున్న సినీ నటీమణులు

ప్రజాశక్తి-గుడివాడ: ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా రాష్ట్రాలలో అతి పెద్ద వస్త్ర వ్యాపార సంస్థ సియంఆర్ టెక్స్‌టైల్స్ అండ్ జ్యూయలర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సియంఆర్ షాపింగ్ మాల్‌ను బుధవారం గుడివాడలోని నెహ్రూచౌక్‌లో ప్రముఖ సినీ తారలు నైనా సారిక, సంయుక్త మీనన్‌లతో పాటు స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, స్టేడియం కమిటి ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావు, అర్బన్‌బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జీ, జనసేన నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కమిటి సభ్యులు కామేపల్లి తులసీబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సియంఆర్ ఫౌండర్, ఛైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ సంస్థను గత నాలుగు దశాబ్ధాలుగా తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా రాష్ట్రాలలో కూడా ఏర్పాటు చేశామన్నారు. గుడివాడలో 38వ షోరూమును ప్రారంభించడం చాల సంతోషంగా ఉందన్నారు. మేనేజింగ్ డైరెక్టర్ మావూరి మోహన్ బాలజీ మాట్లాడుతూ సిఎంఆర్ అంటే ది వన్ స్టాప్ షాప్ అన్నారు. ఫ్యామిలి అందరికి నచ్చే విధంగా అన్ని రకాల వెరైటీలు, డిజైన్స్‌లు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ తారలు నైనా సారిక, సంయుక్త మీనన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వీరు జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం అన్ని సెక్షన్లు తిరిగి అన్ని రకాల వస్త్రాలను పరిశీలించారు. పట్టు ఫ్యాన్సీ చీరలు తమకెంతో నచ్చాయన్నారు. అభిమానులతో సెల్ఫీలు దిగి తమ డ్యాన్సులతో ఫ్యాన్సును ఉర్రూతలూగించారు.

మందకొడిగా ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి-మొవ్వ: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు మందకొడిగా సాగుతోంది. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రైతుకు అందక రైతులు నష్టపోతున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం సేకరణ చాలా తక్కువ స్థాయిలో జరుగుతుంది. వాతావరణం పరిస్థితుల దృష్ట్యా చాలా మంది రైతులు పచ్చి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారస్తులకు అమ్ముకుంటున్నారు. క్వింటా 75 కిలోలు 1300 నుంచి 1450 వరకు ధర ప్రైవేట్ వ్యాపారస్తులకు రైతులు అమ్ముతున్నారు. దీంతో రైతు సేవా కేంద్రాలు వెలవెలబోతున్నాయి. రైతులకు సకాలంలో సంచులు, కాటా వేసిన తర్వాత వెంటనే మిల్లుకు తరలించడానికి లారీల కొరత, అధికారుల అలసత్వం వంటి కారణాలతో రైతు గుండెలలో వాతావరణ పరిస్థితులు గుబులు పుట్టిస్తున్నాయి. వర్షాల నుండి ధాన్యాన్ని కాపాడటానికి పరదాలు లేక రోడ్లమీద గుట్టలుగుట్టలుగా ధాన్యం దర్శనమిస్తున్నాయి. సంచుల్లోకి నింపిన ధాన్యం బస్తాలు రోడ్ల మీదే రోజులు తరబడి నిల్వ ఉంటున్నాయి. ఈ క్రమంలో ఎపి కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు బుధవారం గ్రామాల్లో పర్యటించారు. సంబంధిత అధికారులు స్పందించి రైతులు నష్టపోకుండా చూడాలని కోరారు.

బాల్య వివాహాల నివారణపై అవగాహన

అవనిగడ్డలో...

ప్రజాశక్తి-చల్లపల్లి: ఆడపిల్ల భవిష్యత్తును కాపాడడం సామాజిక బాధ్యతగా భావించి ప్రతిఒక్కరూ బాల్యవివాహాల నిర్మూలనకు కృషి చేయాలని చల్లపల్లి సచివాలయం-1 మహిళా పోలీస్ వేమూరి లావణ్య సూచించారు. బాల్యవివాహ రహిత భారతదేశం కార్యక్రమంలో భాగంగా చల్లపల్లి ఎస్ఆర్‌వైఎస్‌పి హైస్కూల్ ఆవరణలో బుధవారం ఉదయం కిషోర బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ ఆడపిల్లల అభివృద్ధికి ఆటంకం కలిగించే బాల్య వివాహాలు నేరమని వాటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరు సహకారం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్కూలు ప్రధానోపాధ్యాయులు ఎస్ సుదర్శన్, అంగన్వాడి కార్యకర్తలు సిహెచ్ గంగాభవాని, ఈశ్వరి, పద్మజాకుమారి, రమణకుమారి, సత్యవతి, హేమలత పాల్గొన్నారు. **అవనిగడ్డ:** అవనిగడ్డ లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు కళాశాల ప్రిన్సిపాల్ పి రేఖరాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాసవి మహిళా మండలి జిల్లా కోఆర్డినేటర్ పి శాంతి పాల్గొని మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని చిన్న వయసులోనే వివాహం చేస్తే చిన్న వయసులోనే అనేక సమస్యలు ఎదురవుతాయని ఆరోగ్యంగా కూడా నష్టం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఏ శ్రీనివాసరావు అధ్యాపకులు పాల్గొన్నారు. **ఘంటసాల:** వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఘంటసాలలోని మహాత్మాగాంధీ జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం బాల్య వివాహలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు వాసవ్య మహిళా మండలి ప్రతినిధి రాఘవులు దివ్య తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్ఐ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన తర్వాతే బాలికలకు వివాహాలు చేయాలని, తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలాన్నారు. లేకపోతే బాలికలకు మున్ముందు అనారోగ్య సమస్యలు వస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలకు వ్యతిరేకంగా విద్యార్థినులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శ్రీ రంగవల్లి తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాలలో...

ఐఎఫ్ఎస్‌కు కృష్ణచైతన్య ఎంపిక

ప్రజాశక్తి-గన్నవరం: కృష్ణాజిల్లా బాపులపాడు మండలం రంగన్నగూడెం గ్రామానికి చెందిన యువ ఇంజనీర్ తుమ్మల కృష్ణచైతన్య 2023 యు.పి.పి.ఎస్.సి నిర్వహించిన జాతీయ స్థాయి సివిల్ పరీక్షలో ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఎగ్జామినేషన్ - 2023లో జాతీయ స్థాయిలో 74వ ర్యాంక్ సాధించి ఐ.ఎఫ్.ఎస్ కు ఎంపికయ్యారు. కష్ణచైతన్య ఐ.ఏ.ఎస్ సివిల్ పరీక్షలో ప్రిపరేషన్ లో భాగంగా 2018లో ఏ.పి.పి.ఎస్.సి గ్రూప్-2లో మంచి ర్యాంక్ సాధించి ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో పరిశ్రమశాఖలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ గా పనిచేస్తూ ఐ.ఎఫ్.ఎస్ కు ఎంపికైన తర్వాత డిశెంబర్ 2వ తేదీన ఇక్కడ నుంచి రిలీవ్ అయి ఉత్తారాఖాండ్ డెహ్రాడూన్ లో ఉన్న ఇందిరగాంధీ నేషనల్ ఫారెస్ట్ అకాడమీలో ట్రైనింగ్ నిమిత్తం వెళ్ళుటకు సిద్ధంగా వున్న నేపద్యంలో ఈరోజు ఉదయం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తుమ్మల కష్ణచైతన్యను సచివాలయంలోని తన చాంబర్ కు పిలిపించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల కృష్ణచైతన్య ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో మాట్లాడుతూ కృష్ణాజిల్లా బాపులపాడు మండలం, రంగన్నగూడెం నుంచి గ్రామీణ రైతు కుటుంబంలో నుంచి వచ్చిన తాను తల్లిదండ్రులు మరియు రంగన్నగూడెం గ్రామస్థుల ఇచ్చిన ప్రోత్సహంతో 2016 నుంచి సివిల్ పరీక్షలు వ్రాస్తూ 4వ ప్రయత్నంగా ఐ.ఎఫ్.ఎస్.ఇ - 2023 పరీక్ష రాసి ఈ కేటగిరిలో జాతీయ స్థాయిలో భారతదేశం వ్యాప్తంగా ఐ.ఎఫ్.ఐ వ్రాతపరీక్షకు 3 లక్షల మంది హాజరు అవ్వగా 1800 మంది మాత్రమే వ్రాతపరీక్షలో ఉత్తీర్ణత సాధించగా అందులో నుంచి మౌఖికంగా పరీక్ష అనంతరము అన్ని కేటగిరీలకు కలిసి 150 మంది ఎన్నికైనారని, అందులో తాను 74వ ర్యాంక్ సాధించినానని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా రంగన్నగూడెం గ్రామానికి చెందిన తుమ్మల కష్ణచైతన్యకు అభినందనలు తెలియజేయటం పట్ల రంగన్నగూడెం గ్రామసర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపిటిసి సభ్యులు పుసులూరు లక్ష్మినారాయణ, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు తుమ్మల దశరధరామయ్య, ఎంపిఎస్ అధ్యక్షులు మొవ్వ శ్రీనివాసరావు, ఉప సర్పంచ్ బెజవాడ వెంకట కృష్ణారావు, గ్రామ టి.డి.పి అధ్యక్షులు మొవ్వ వేణుగోపాల్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అయ్యప్పలకు అన్నప్రసాదం వితరణ

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం గ్రామంలో గణపతి సుబ్రహ్మణ్య సహిత కనకదుర్గ దేవి ఆలయంలో అఅయ్యప్ప స్వామి ఇరుముడి సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భవానీలు, అయ్యప్ప భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎంతో నియమ నిష్ఠలతో అయ్యప్పస్వామిని ఆరాధిస్తున్న స్వామి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించడం తమకు సంతోషంగా ఉందని ఇరుముడి కట్టించుకున్న అయ్యప్ప స్వాములు తెలిపారు. అయ్యప్ప ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భవానీలు, అయ్యప్ప భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఎంతో నియమ నిష్ఠలతో అయ్యప్పస్వామిని ఆరాధిస్తున్న స్వామి భక్తులకు అన్న ప్రసాదాన్ని అందించడం తమకు సంతోషంగా ఉందని ఇరుముడి కట్టించుకున్న అయ్యప్ప స్వాములు తెలిపారు.

జాతీయస్థాయి పోటీలకు మదర్ థెరిసా విద్యార్థులు

ప్రజాశక్తి-చల్లపల్లి: డిసెంబర్ 7, 8, 9 తేదీలలో హర్యానాలో జరిగే జాతీయస్థాయి స్క్వే పోటీలకు చల్లపల్లి సెయింట్ మదర్ థెరీసా ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్లు స్కూల్ కరెస్పాండెంట్ ఆండ్రూ గోమ్స్ బుధవారం తెలిపారు. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ లో భాగంగా ఈ నెల 24, 25వ తేదీల్లో చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి స్క్వే ఛాంపియన్ షిప్ పోటీలలో తమ పాఠశాల నుండి అయిదుగురు విద్యార్థులు పాల్గొనగా వారిలో నాలుగు బంగారు పతకాలు, ఒక రజత పతకం సాధించినట్లు చెప్పారు. విజేతలను కరస్పాండెంట్ ఆండ్రూ గోమ్స్, ప్రిన్సిపల్ ప్రశాంతి గోమ్స్, కోచ్ సుబ్బు, ఉపాధ్యాయులు అభినందించారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

ప్రజాశక్తి-చల్లపల్లి: లయన్స్ ఆఫ్ చల్లపల్లి విఆర్‌కె నగర్ ఆధ్వర్యంలో ఆదరణ వృద్ధాశ్రమంలో బుధవానం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు రాయపాటి రాధాకృష్ణ కుమారుడు రాయపాటి భరద్వాజ్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కస్తూరి వెంకట వరప్రసాద్, కోశాధికారి ముమ్మనేని రాజ్‌కుమార్, లయన్స్ జిల్లా 316 డి అదనపు కార్యదర్శి లయన్ నర్రా సాయిబాబు, కార్యవర్గ సభ్యులు తగిరిశ సాంబశివరావు, మోపిదేవి వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షులు కొల్లిపర నాగపోతరాజు తదితరులు పాల్గొన్నారు.

వరి పంటల పరిశీలన

ప్రజాశక్తి-గన్నవరం: బుద్ధవరం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నవరం మండల వ్యవసాయ అధికారిని వై.రజని వరి పొలాలను సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ధాన్యం విక్రయించాలని చెప్పారు. ధాన్యంలో తేమ శాతం 17 ఉండేలా చూసుకోవాలని తెలిపారు. ధాన్యం సాధారణ రకం (కామన్) వంద కిలోలకు రూ.2300, 75 కిలోల బస్తా రూ.1725, గ్రేడ్-ఎ రకం వంద కిలోలకు రూ.2320, 75 కిలోల బస్తాకు రూ.1740 చెల్లించడం జరుగుతుందన్నారు.

కరాటే పోటీలకు వసుధ ఎంపిక

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 24, 25 తేదీల్లో అనంతపురంలో జరిగిన అండర్-17 బాలికల 56 కిలోల కరాటే విభాగంలో మంగళగిరికి చెందిన జెకె గోజు రైయి కరాటే అకాడమీ విద్యార్థిని కె.వసుధ జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అనంతపురంలోని అశోక్‌నగర్ ఇండోర్ స్టేడియంలో అండర్-14, 17 విభాగాల్లో బాలబాలికలకు కరాటే స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లాల్లో జరిగిన పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కరాటే క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో అరవింద విద్యాసంస్థల విద్యార్థిని కె.వసుధ జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. ఆమెకు కోచ్ గా సిహెచ్.మహేష్‌బాబు వ్యవహరించారు. జాతీయ పోటీలకు ఎంపికైన వసుధను, శిక్షణ ఇచ్చిన కోచ్ మహేష్‌ను కరాటే ఫెడరేషన్ ఫౌండర్ షిహన్ జె.శ్రీనివాసులు, టెక్నికల్ హెడ్ రెన్షి జె.హరినాథ్ అభినందించారు.

నామమాత్రంగా పత్తి కొనుగోలు కేంద్రాలు

ప్రజాశక్తి - నందిగామ : పత్తి కొనుగోలు కేంద్రాలు నామమాత్రంగా పని చేస్తుండటంతో పత్తి రైతులు అవస్థలు పడుతున్నారు. జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. రైతులు పత్తి అమ్మకానికి గుంటూరు సిసిఐ కొనుగోలు కేంద్రానికి వెళ్లాలంటే అనేక వ్యయప్రయాసలకు గురి కావాల్సి వస్తుంది. నందిగామ వ్యవసాయ మార్కెట్ యార్డ్ వద్ద పత్తి కొనుగోలు కేంద్రం వద్ద కొనుగోలు లేకపోవడంతో అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. గుంటూరు స్పిన్నింగ్ మిల్లు వద్దకు వెళ్లి అమ్మ లేక గ్రామాలలో దళారులకు తక్కువ రేటుకు అమ్మి క్వింటాకు ఎనిమిది వందల వరకు నష్ట పోతున్నారు. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఇటీవల అధికారులతో కలిసి ఆర్భాటంగా నందిగామలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఒక్క రోజు తప్ప, మరుసటి రోజు నుండి పత్తి కొనటం మానేశారు. అధికారులు ఆచరణలో పూర్తిగా విఫలమయ్యారు.

సిసిఐ పత్తి క్వింటాకు రూ.7520లు ధర ప్రకటించింది. బ్లాక్ మార్కెట్‌లో క్వింటా 5 వేల నుండి 6 వేలకు మించి కొనుగోలు చేయడం లేదు. అక్కడక్కడ 6 వేల నుంచి 6,500 వరకు కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, కంచికచర్ల, మైలవరం, తిరువూరు మార్కెట్ యార్డ్‌లలో పత్తి కొనుగోలు కేంద్రాలు మొక్కుబడిగా ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. సాకులు చెప్తూ రోజుల తరబడి గడుపుతూ బయ్యర్లు చేతులు దులుపుకుంటున్నారు. గుంటూరులో బయ్యర్లు ఎంపిక చేసుకున్న జిన్నింగ్ మిల్లులు వద్దకు తీసుకెళ్లిన పత్తి మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. తద్వారా పత్తి రైతులపై రవాణా, ఇతర ఛార్జీలతో కలిపి అదనంగా రూ.400 పైన ఖర్చవుతుంది.

తరుగు కోత

గుంటూరు జిన్నింగ్ మిల్లులు వద్ద పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉందని రైతులను దోచుకుంటున్నారు. క్వింటాకు నాలుగైదు కేజీలు తరుగు తీస్తున్నారు. ఐదు కేజీలు తరుగు తీస్తే క్వింటాకు సుమారు నాలుగు వందల రూపాయల వరకు రైతు నష్టపోతున్నారు. రవాణా ఖర్చు, తరుగు కలిపి లెక్కలు వేసుకుని రైతులు గుంటూరు జిన్నింగ్ మిల్లులకు వెళ్లలేక దళారులకు అమ్ముకుని నష్టపోతున్నారు. నందిగామ మార్కెట్ యార్డ్‌లో 9 వేలు, కంచికచర్లలో పదివేలు, మైలవరంలో 4500, జగ్గయ్యపేటలో 2100, తిరువూరులో 1100 మాత్రమే సిసిఐ కొనుగోలు చేసింది. సుమారు 1200 మంది రైతుల వద్ద మాత్రమే కొనుగోలు చేశారు. జిల్లాలో 80 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. ఇప్పటికైనా మార్కెట్ యార్డ్ వద్దనే పత్తి కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

మిల్లు వద్ద పత్తి అమ్ముతున్న దృశ్యం

సారవంతమైన భూములను కోల్పోతున్నాం

మైలవరం ఎంఎల్‌ఎకు రైతుల ఫిర్యాదు



ఎంఎల్‌ఎ వసంతకు వినతిపత్రం ఇస్తున్న రైతులు

ప్రజాశక్తి - మైలవరం : అభివృద్ధికి తాము వ్యతిరేకం కాదని ఎటువంటి సమాచారం లేకుండా, భూ యజమానులకు తెలియజేయకుండా భూములను సర్వే చేసి ఆ భూముల్లో రాళ్లను పాతారని, దీనివల్ల ఎంతో సారవంతమైన భూములను కోల్పోతున్నామని జి.కొండూరు మండలం కోడూరు, చిన్న నందిగామ గ్రామాలకు చెందిన పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక శాసనసభ్యులు వసంత కృష్ణ ప్రసాద్‌కు మైలవరంలోని ఎంఎల్‌ఎ కార్యాలయంలో పలువురు రైతులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిన్న నందిగామ, కోడూరు గ్రామాలకు చెందిన రైతులు మాట్లాడుతూ తాజాగా అధికారులు సర్వే చేస్తున్న మార్గం అనేక మలుపులతో ఉందని ఔటర్ రింగ్‌రోడ్డు ఏర్పాటు చేయటం వల్ల ఎంతో సారవంతమైన భూములు కోల్పోతున్నామని అన్నారు. మామిడి, సపోటా, వంటి పండ్ల తోటలతో పాటు పత్తి, మిర్చి, పసుపు, వరి వంటి వాణిజ్య పంటలను సాగు చేస్తున్నామని ఎప్పటినుండో భూములనే నమ్ముకుని ఉన్న తమకు చిన్నాచితక భూములను కోల్పోవాల్సి వస్తుందన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు కోసం తాజాగా అధికారులు నిర్వహించే సర్వే ప్రాంతంలో రెండు చెరువులూ ఉన్నాయని వాటి కొండ ఔటర్ రింగ్ రోడ్డు వెళితే చెరువులు రెండూ పూడుకు పోయి ఎగువ నుండి వచ్చే వరద చెరువుల్లోకి వెళ్లే అవకాశం లేక నూతనంగా నిర్మించే ఔటర్ రింగ్‌రోడ్డు కోత గురయ్యే అవకాశం ఉందని, కోడూరు, చిన్న నందిగామ, భీమవరపాడు, సీతారాంపురం తదితర గ్రామాల ప్రజలకు పశువులకు తాగునీరు సాగునీరు లేక ఇబ్బందులుకు గురవుతామని దీంతో ఈ ప్రాంతమంతా ఎడారిగా మారే అవకాశం ఉందన్నారు. ఈ గ్రామాల్లో ఎస్సీ ఎస్టీ బీసీలకు చెందిన సుమారు 5 వేలమంది ఉన్నారని తమ జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకొని తాజాగా సర్వే చేస్తూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి చేస్తున్న ప్రయత్నాలను నిలుపుదల చేయాలని ఎంఎల్‌ఎకు విజ్ఞప్తి చేశారు.

విశాఖ లా విద్యార్థికి న్యాయం చేయాలని నిరసన

ఇబ్రహీంపట్నంలో నిరసన తెలుపుతున్న విద్యార్థులు, కంచికచర్లలో ...

ప్రజాశక్తి - కంచికచర్ల : విశాఖలో లా విద్యార్థినికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బుధవారం విద్యార్థులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గోపి నాయక్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభివృద్ధి కోసం చేసిన వాగ్దానాలు వాస్తవాల్లోకి రావడం లేదని, దానికి నిదర్శనమే మహిళలపై జరుగుతున్న అత్యాచారాలని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై అత్యాచారం చేయాలన్న ఆలోచన కూడా రాకూడదనేలా శిక్షను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్ కుమార్, గోపి, ఇందు, మహాలక్ష్మి, తులసి, పాల్గొన్నారు. **ఇబ్రహీంపట్నం :** ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో విద్యార్థినులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైజాగ్‌లో విద్యార్థినిపై లైంగిక దాడి జరగడం దారుణమని, ఇలాంటి ఘటనలు రోజూ రోజుకు పెరిగిపోతున్నాయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా చట్టాలు పటిష్టంగా అమలు చేయడంలో విఫలం అయ్యారని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ మండల నాయకులు కుషాల్ కుమార్, కోటి, శంకర్, లక్ష్మి విద్యార్థులు పాల్గొన్నారు.

బండిపాలెంలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని బండిపాలెంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట ఎడిఎ ఎ.భవానీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భవాని మాట్లాడుతూ గ్రామంలో రైతు సేవ కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయటం జరిగిందని, కాబట్టి రైతులంతా వరి ధాన్యాన్ని దళారులకు అమ్మి నష్టపోవద్దని ప్రభుత్వం గ్రేట్ ఏ ధన్యం క్వింటాకు రూ.2,320 లు, సాధారణ రకం 2,300 ఇస్తుందని తెలిపారు. గోనెసంచులు, హమాలీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రబీ 2024-25 సంవత్సరం సంబంధించి ఈ పంట నమోదు చేయటం జరుగుతుందని రైతులందరూ ఈ పంటను నమోదు చేసుకోవాలని తెలిపారు. అనంతరం ధాన్యం కొనుగోలు ఏ విధంగా జరుగుతుందని రైతులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాకు 29,30 తేదీల్లో వర్ష సూచన ఉన్నందున రైతులు వరి కోతలు వాయిదా వేసుకోవాలని ఆరబెట్టుకున్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తీసుకువెళ్లాలని, ఏమైనా ఇబ్బందులు ఉంటే తమకు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అదనపు భారం తొలగింపు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : విశ్రాంత ఉద్యోగులపై అదనపు భారాన్ని తొలగించడంపై విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని ధరణికోట విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం సంఘ ప్రెసిడెంట్ దారా వినోద్ బాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కమ్యూటేషన్ రికవరీ ప్రతి విశ్రాంత ఉద్యోగికి ప్రతి నెల రూ.4 నుంచి 5 వేలు కట్ అవుతుందన్నారు. ఇతర రాష్ట్రాల్లో కోర్టుకు వెళ్లి విశ్రాంత ఉద్యోగులు విముక్తి సాధించారని ఏపి ప్రభుత్వం కోర్టుల చుట్టూ తిప్పకుండా ఆ భారం నుంచి విముక్తి కలిగించిందని అన్నారు. ఈ సమావేశంలో సంఘ సెక్రెటరీ చింతల తిరపయ్య విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలో మంగళవారం రాత్రి బస్సులో రూ.20 వేల విలువైన బంగారు వస్తువులు ప్రయాణికులు మర్చిపోయి వెళ్లారు. గమనించిన బస్సు కండక్టర్ వి.శ్రీదేవి వాటిని భద్రపరిచి ఫోన్ ద్వారా బాధితురాలు కె.నాగమణికి సమాచారం అందించారు. అనంతరం బస్‌డిపోలో ఆ వస్తువులు ఆమెకు అందజేశారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని విజ్ఞాన స్కూల్‌లో బుధవారం న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 'బాల్య వివాహ రద్దు భారతదేశం' అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రావణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాల సాధన కోసం ఇప్పటినుండే ప్రణాళిక బద్ధంగా చదువుకొని ఉన్నత స్థానాలకి ఎదగాలన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించాలన్నారు. బాల్య వివాహం చట్ట రీత్యా నేరం అన్నారు. ఎటువంటి విషయాలు తెలిసినా లీగల్ సర్వీసెస్‌కి గానీ, పోలీసులకు గానీ తెలియజేయాలని సూచించారు. భారత రాజ్యాంగం గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.శోభారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందర్రావు, పి.సత్య శ్రీనివాసరావు, న్యాయవాదులు మెట్టెల వీరాంజనేయులు, నరసింహారావు, లీగల్ సర్వీసెస్ లాయర్ డి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గంపలగూడెం : విద్యుత్ తీగలు తగిలి వ్యక్తి తీవ్రగాయాలైన ఘటన మండలంలో బుధవారం చోటు చేసు కుంది. గంపల గూడెం నుండి తిరువూరు పోతున్న లోడ్ లారీ కొల్లా రమనాదం పొలం వద్ద విద్యుత్ తీగలు పట్టి తెగిపోయాయి. వెనుకనే ప్రయాణిస్తున్న వ్యక్తికి ఆ తీగలు ఒక్కసారిగా తగలడంతో ముఖ భాగానికి గాయాలయ్యాయి. ముక్కులో నుండి తీవ్రంగా రక్తం కారడంతో గుర్తించిన ప్రయాణికులు 108 ద్వారా ఆస్పత్రికి తరలించారు.

బాల్యవివాహాల నిరోధానికి ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - తిరువూరు : బాల్య వివాహాలకు వ్యతిరేకంగా తిరువూరు కోర్టులో బుధవారం న్యాయవాదుల, గుమస్తాల, కోర్టు సిబ్బంది, పోలీసులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.మోతి లాల్ ప్రతిజ్ఞ చేయించారు. 'నేను బాల్య వివాహాలకు వ్య తిరేకంగా సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తానని, నా కుటుంబం, నా ఇరుగు, పొరుగు ప్రాంతాలలో లేదా సమాజంలో ఏ ఆడపిల్లకు బాల్య వివాహాలు జరగకుం డా ఖచ్చితంగా చూస్తానని, బాల్య వివాహ రహిత భారతదేశాన్ని రూపొందించడానికి నేను పూర్తి మద్దతు ఇస్తున్నా'నని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాకదాని లక్ష్మీనారాయణ, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ షేక్ బడే మియా, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎం.రాము, సీనియర్ న్యాయవాదులు సంక్రాంతి జనార్దనరావు, నాళ్ళ వెంకట సత్యనారాయణ, నాగుబండి రామకృష్ణ, రాజవరపు శ్రీనివాసరావు, అత్తునూరి శ్రీనివాసరావు, రామసీత, అంజన్ రెడ్డి, పాల్గొన్నారు.

తెలంగాణా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - వత్సవాయి : తెలంగాణ నుండి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి పోలీసులు 90 తెలంగాణా మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం... వత్సవాయి గ్రామానికి చెందిన కంచర్ల నాగభూషణం తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా, బోనకల్లు మండలం, బోనకల్లు గ్రామం వైన్‌షాప్ నుండి 90 తెలంగాణ మద్యం సీసాలను మోటార్‌సైకిల్ మీద తీసుకొని వస్తుండగా సమాచారం మేరకు పట్టుకున్నట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ బి.గురవయ్య తెలిపారు. మోటార్‌సైకిల్‌ను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ మోహనశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు

ప్రజాశక్తి - మైలవరం : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ఇద్దరు లబ్ధిదారులకు ఆర్థికసాయం మంజూరైంది. మైలవరం ఎంఎల్ఎ వసంత వెంకట కృష్ణప్రసాదు సంబంధిత చెక్కులను ఆయన కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. మైలవరం పట్టణానికి చెందిన కలకొండ రామారావుకు రూ.80 వేలు, సబ్జపాడు గ్రామానికి చెందిన మోదుగువరపు శివకుమారికి రూ.44వేలు సిఎంఆర్ఎఫ్ నుంచి మంజూరయ్యాయి.

పాఠశాలకు పూర్వ విద్యార్థి విరాళం

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న సైకిల్ షెడ్ నిర్మాణానికి అదే పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొత్త గుండ్ల ప్రసాద్ విరాళమిచ్చారు. బుధవారం పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు కె.శంకరరావుకు రూ.20 వేలు నగదును అందజేశారు. తను చదువుకున్న పాఠశాలకు సహాయం చేయటం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్ ఎంసి చైర్మన్ అబ్రహం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెచ్ఎంకు విరాళం అందజేస్తున్న ప్రసాద్

శక్తి బృందాలు బలోపేతం : ఎస్‌పి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

ప్రభుత్వం మొట్టమొదటి ప్రాధాన్యత మహిళల భద్రత అని, మహిళలలో ఆత్మస్థైర్యం నింపాలన్న లక్ష్యంతో కృష్ణాజిల్లా పోలీస్ వారి ఆధ్వర్యంలో శక్తి టీమ్స్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు పేర్కొన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ కొరకు ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్‌ను మరింత బలోపేతం చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన 'కెపాసిటీ బిల్డింగ్ ఆఫ్ శక్తి టీమ్స్' కార్యక్రమాన్ని బుధవారం యిఔష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సెల్ఫ్ డిఫెన్స్ టెక్నిక్స్ నిర్చుకోవడం వలన మనల్ని మనం కాపాడుకోవడమే కాకుండా ఇతరులను కూడా రక్షించవచ్చన్నారు.సుమారు 3 వారాల క్రితం 40 మహిళా పోలీసు సిబ్బందితో 20 శక్తి టీమ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి శక్తి టీమ్ తమకు కేటాయించిన వాహనం ద్వారా కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్లు, రైల్వే స్టేషను మరియు పబ్లిక్ ప్లేసెస్ లో గస్తీ తిరుగుతూ మహిళల భద్రత కొరకు కృషి చేస్తున్నారన్నారు. అదేవిధంగా 112 టోల్ ఫ్రీ నెంబరు ద్వారా ఏదైనా ఫిర్యాదు అందుకున్న వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి ప్రెసిడెంట్ డాక్టర్ బొల్లినేని కీర్తి, కె.హేమంత్‌కుమార్, అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి.నాయుడు, మహిళా పోలీస్ స్టేషన్ డిఎస్పి ఎన్.సురేష్‌కుమార్‌రెడ్డి, ఇన్స్పెక్టర్ వి.వెంకటేశ్వరరావు, ఎస్పై ఇన్స్పెక్టర్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ: మామిడి పంటకు సోకే తెగుళ్ల నివారణకు వేప నూనె పిచికారితో తేనే మంచు పురుగు కాయతోలుచు పురుగు నివారించుకోవచ్చునని ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కోఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. బుధవారం అవనిగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మామిడి పంటలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తేనే మంచు కాయతో పురుగుల నివారణకు వేప నూనె పిచికారి ఎంతగానో దోహదపడుతుందన్నారు. శాస్త్రవేత్త డాక్టర్ వి మంజువాణి సమగ్ర యాజమాన్య పద్ధతులను వివరిస్తూ యూరియా ఫాస్ఫరస్ పొటాష్ వినియోగించవలసిన పద్ధతులను రైతులకు వివరించారు. మరో శాస్త్రవేత్త డాక్టర్ రేవతి మామిడి పురుగుల తెగుళ్ల యాజమాన్య పద్ధతులు వివరించారు. ఉద్యానవన శాఖ అధికారి రమేష్ ఉద్యానవన విభాగంలో సబ్సిడీ లను వివరించి వివిధ రకాల పంటలకు అందించే సబ్సిడీల గురించి వివరించారు. సబ్సిడీలు పొంది పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించాలని రమేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో కొక్కిలిగడ్డ తనుజ తదితరులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-అవనిగడ్డ: అవనిగడ్డలోని రాజీవ్ విగ్రహం సెంటర్లో వంతెన సమీపంలో పెద్ద గోతులు పడి వాహన చోదకులు తరచూ ప్రమాదాల గురికావడంతో స్పందించిన సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాసరావు సొంత ఖర్చులతో గుంతలను పూడ్చే కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం రాత్రి పోలీసు అధికారులు ఆ ప్రాంతంలోని గుంతలను పూడ్చి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా సామాజిక సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులకు ప్రజలు, వాహనచోదకులు అభినందనలు తెలిపారు.

త్వరలో మొబైల్ రైతు బజార్ ఏర్పాటు : యలమంచిలి

ప్రజాశక్తి-కంకిపాడు: కంకిపాడు మండల పరిధిలో ఉన్న 21 గ్రామాలతో పాటు, చుట్టుపక్కల మండలాలకు చెందిన వారికి కూడా ఎంతో ఉపయుక్తంగా ఉండేలా మొబైల్ రైతు బజారు ఏర్పాటు చేయనున్నట్లు కంకిపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఈ నెల 21న వ్యవసాయ రైతు బజార్ల ఉన్నతాధికారులను కోరామని, అందుకు అనుగుణంగా ప్రస్తుతం ప్రభుత్వ స్థాయిలో మొబైల్ రైతు బజార్ల ఏర్పాటు అంశం పరిశీలన దశలో ఉందని, అవసరమైన అనుమతులు లభించిన తరువాత మొబైల్ రైతు బజారు ఏర్పాటు నిర్వహించుటకు చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ వాజిజ్య, మార్కెటింగ్ అధికారి తెలిపినట్లుగా చెప్పారు.

వెంకటేశ్వరరావుకు నివాళి

ప్రజాశక్తి-పమిడిముక్కల: పరుచూరి వెంకటేశ్వరరావు హనుమంతపురం గ్రామ సర్పంచ్‌గా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, ఆయన మరణం టిడిపికి తీరని లోటని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార రాజా అన్నారు. బుధవారం మండలంలోని హనుమంతపురం గ్రామంలో పరుచూరి వెంకటేశ్వరరావు మృతదేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ తాగునీరు, విద్యుత్ వంటి అనేక కనీస సౌకర్యాలు వెంకటేశ్వరరావు ప్రజలకు కల్పించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లింగమనేని బాబురావు, జక్క శ్రీనివాసరావు, కాచినేని ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అందజేత

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల అంబేద్కర్ నగర్‌కు చెందిన గంజి శాంతశ్రీ స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలో బుధవారం గోల్డ్ లోన్ రూ.90 వేలు చెల్లించి 13 గ్రాముల బంగారం ఇంటికి తీసుకెళ్తుండగా మార్గమధ్యలో బ్యాంక్ పాస్ బుక్, నగలతో ఉన్న కవర్ పడిపోయింది. కవర్ పడిపోయిన సంగతి చూసుకోని శాంతశ్రీ ఇంటికి వెళ్లిన తరువాత గమనించి ఆందోళనకు గురైంది. రోడ్డుపై పడి ఉన్న కవరును మల్లాయి చిట్టూరు గ్రామస్థుడు చింతా సుబ్బారావు గమనించగా, బంగారం, ఎస్బీఐ పాస్ బుక్ కనిపించాయి. దీంతో సుబ్బారావు బ్యాంకుకు వెళ్లి బ్రాంచ్ మేనేజర్ సునీల్ కుమారుకు అప్పగించాడు. వాటిని పరిశీలించిన బ్యాంక్ మేనేజర్ సిబ్బంది ద్వారా వివరాలు సేకరించి శాంతశ్రీకి సమాచారం అందచేశారు. బ్యాంకులో బీఎం సునీల్ కుమార్ శాంతశ్రీకి బంగారం అప్పగించారు. రోడ్డుపై దొరికిన బంగారం నిజాయితీగా తెచ్చి అప్పగించిన సుబ్బారావును బ్యాంక్ అధికారులు అభినందించి బహుమతి అందించారు. దొరికిన బంగారం తమకు అప్పగించిన సుబ్బారావుకు శాంతిశ్రీ, ఆమె కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

ఎంఇఓపై మహిళా టీచర్ల ఫిర్యాదు

ప్రజాశక్తి-తోట్లవల్లూరు: మహిళా టీచర్లను కేవలం యుటిఎఫ్ టీచర్లను టార్గెట్ చేసి మండల ఎంఈఓ జి.వెంకటేశ్వరరావు వేధిస్తున్నారని యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో ఎంపీడీవో రవికాంత్, ఎంఈఓ వెంకటేశ్వరరావుకు బుధవారం ఫిర్యాదుతో కూడిన వినతిపత్రం అందించారు. యుటిఎఫ్ మండలాధ్యక్షురాలు సిహెచ్ మైథిలి, ప్రధాన కార్యదర్శి ఎం.విజయశ్రీ, బి హేమకుమారి, విష్ణువర్ధన్ తదితరుల ఆధ్వర్యంలో వినతిపత్రం అందించడం జరిగింది. యూనియన్ కోఆర్డినేషన్ మీటింగు సమాచారం యుటిఎఫ్ నాయకులకు చెప్పడం లేదని, పాఠశాలలకు వెళ్లినప్పుడు మహిళా టీచర్లను టార్గెట్ చేసి వేధిస్తున్నారని, అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నారని వినతిలో పేర్కొన్నారు. సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలల్లో సెలవు పెట్టినప్పుడు సిఆర్ఎంటిలను నియమించకుండా ఎంఈఓ ఉపాధ్యాయులను వేధిస్తున్నాడని, పెనమకూరు కాంప్లెక్స్‌లో జరిగిన మీటింగ్లో కేవలం మహిళా ఉపాధ్యాయులను మాత్రమే చూస్తూ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని మానసికంగా బాధపడేటట్లు మాట్లాడారని వారు తీవ్ర మనస్థాపానికి గురై సూసైడ్ చేసుకుంటే బాధ్యులు ఎవరని వినతిలో పేర్కొన్నారు. విజిట్స్ మరియు ఇన్స్పెక్షన్ చేసే సమయంలో బాధ్యతారహితంగా ఉన్న ఉపాధ్యాయులపై బాధ్యత రహిత చర్యలు తీసుకుని మెమో ఇవ్వాలి అంతేకానీ

నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకునేది లేదన్నారు. యుటిఎఫ్ టీచర్స్ కు మిగతా యూనియన్ టీచర్లకు మధ్య గొడవలు పెడుతున్నారని, ఒకరంటే ఒకరికి దురఅభిప్రాయం కలిగేలా పరిస్థితులు కల్పిస్తున్నాడని పేర్కొన్నారు. యుటిఎఫ్ టీచర్లు పెట్టిన పెన్షన్ ప్రపోజల్స్ రాకుండా చేస్తున్నాడని, ఎంఈఓగా బాధ్యతలు సక్రమంగా నిర్వహించి రిటైర్మెంట్ అయిన వారికి పెన్షన్ వచ్చేలా చేయాలన్నారు. తోట్లవల్లూరులో ఉన్న మహిళా టీచర్ గురించి పెనమకూర్లో మాట్లాడటం మంచి పద్ధతి కాదన్నారు. పొట్టిదిబ్బలంక పాఠశాలలో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలిపై కూడా అనేకమార్లు దుర్భాషలాడేరని ఎంఈఓ తన పద్ధతి మార్చుకోకుంటే యుటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నాకు సైతం సిద్ధమని వినతిపత్రంలో పేర్కొన్నారు.

'ఆహారం కల్తీ ప్రభావం'పై ముగిసిన వర్క్‌షాపు

ప్రజాశక్తి-ఉయ్యూరు: స్థానిక ఆడుసుమిల్లి గోపాలకృష్ణయ్య, చెరుకు రైతుల సిద్ధార్థ డిగ్రీ కళాశాలలో బుధవారం ఉయ్యూరు రసాయన శాస్త్ర విభాగం వారు మరియు ఫుడ్ సేఫ్టీ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా వారు 'ఆహారం కల్తీ ప్రభావం' అనే అంశంపై రెండు రోజులు వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శివనాథ్ మాట్లాడుతూ ఆహార కల్తీ అనేది ఆహార పదార్థాలలో పరిమాణాన్ని పెంచడానికి లేదా రూపాన్ని మెరుగుపరచడానికి, తరచుగా నాణ్యత మరియు భద్రత యొక్క ఖర్చుతో ఆహార పదార్థాలలో పదార్థాలను జోడించడం, తొలగించడం లేదా ప్రత్యామ్నాయం చేయడం వంటి చర్యలను సూచిస్తుంది అని అన్నారు. కళాశాల ప్రత్యేక అధికారి కె . సత్యనారాయణ గారు ఇది ప్రతికూల ఆరోగ్యం, ఆర్థిక మరియు సామాజిక ప్రభావాలను కలిగించే తీవ్రమైన సమస్య. ఆహార కల్తీకి సంబంధించిన ప్రధాన సమస్యలు ఇక్కడ ఉన్నాయి. ఆరోగ్య ప్రమాదాలు తక్షణ ప్రభావాలు కల్తీ ఆహారాన్ని తీసుకోవడం వల్ల ఫుడ్ పాయిజనింగ్, కడుపు రుగ్మతలు మరియు అలర్జీలు వస్తాయి. దీర్ఘకాలిక అనారోగ్యాలు, దీర్ఘకాల వినియోగం క్యాన్సర్, కాలేయం మరియు మూత్రపిండాల నష్టం, హార్మోన్ల అసమతుల్యత మరియు బలహీనమైన రోగనిరోధక శక్తి వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీయవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో పిన్నమనేని సిద్ధార్థ కళాశాల నుంచి డాక్టర్ సుష్మచౌదరి, డిగ్రీ రసాయన శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ జి.గిరిప్రసాద్, పీజీ రసాయన శాస్త్ర శాఖాధిపతి డాక్టర్ వీఎన్‌వి కిషోర్, అధ్యాపకులు కె.రమేష్, ఎమ్.వి శాంతి, దిల్ షాద్ బేగం, ఎమ్.రేఖ, ఎమ్ శాంతి, పి.సురేష్ పాల్గొన్నారు.

సెయింట్ ఆన్స్ స్కూల్లో మాక్ పార్లమెంట్

ప్రజాశక్తి-అవనిగడ్డ

అవనిగడ్డలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ మాక్ పార్లమెంట్లో కమ్యూనల్ వ్యవస్థలపై చర్చ నిర్వహించారు. దేశ పార్లమెంటరీ సభ వాతావరణాన్ని కంటికి కట్టినట్లు నిర్వహించి స్కూలు విద్యార్థులు అందరూ వీక్షించేందుకు ఏర్పాటు చేశారు. పార్లమెంట్ సభలో వివిధ కమ్యూనిటీ రాజకీయాలకు స్వస్తి చెప్పాలని భారత రాజ్యాంగం నిర్దేశించిన కులమత రహిత సమానత్వ సమాజం నిర్మించాలని సభలో వాదనలు వినిపించారు. అధికార ప్రతిపక్ష నేతలుగా విద్యార్థులు పలు భాషల్లో ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రిన్సిపాల్ అమలాపుష్పం నిర్వహించగా ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ఆలయానికి రూ.4 లక్షలు విరాళం

ప్రజాశక్తి-ఘంటసాల: ఘంటసాల మండలం చిట్టూర్పు గ్రామంలో వేంచేసి ఉన్న గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలో నెలవారి కైకర్యాల నిమిత్తం గ్రామానికి చెందిన వేములపల్లి సుబ్బయ్య, రత్నమాణిక్యం కుమారుడు చిట్టూర్పు మాజీ సర్పంచ్ వెంకట రామ్మోహనరావు జ్ఞాపకార్థం ఆయన సతీమణి పుష్పావతి, కుటుంబ సభ్యులు రూ.4 లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు వేములపల్లి వెంకట్రావు, వేములపల్లి కనకమల్లేశ్వరి, గుత్తికొండ ప్రసాద్‌కు బుధవారం అందించారు. ఆలయానికి భారీ విరాళం అందించిన దాతలకు ఆలయ కమిటీ తరపున కతజ్ఞతలు తెలిపారు.

కానిస్టేబుల్ ఆత్మహత్య

ప్రజాశక్తి-కంకిపాడు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో యనమలకుదురు గ్రామంలో ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బుధవారం ఇంట్లో ఉన్న ఫ్యానుకి ఉరివేసుకొని చిరంజీవి అనే కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నాడని పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపారు. అతను ఎపిఎస్‌పికి చెందిన కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడని, చిరంజీవి స్వస్థలం నెల్లూరు జిల్లా వెంకటగిరి అని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎన్‌టిఆర్ స్టేడియం అభివృద్ధికి చర్యలు : యలవర్తి

ప్రజాశక్తి-గుడివాడ : గతంలో క్రీడల పట్ల శ్రద్ధ చూపించలేక పోయామని నూతన కమిటీ ఆధ్వర్యంలో మళ్ళీ అన్ని క్రీడలను నిర్వహించి క్రీడాకారుల కర్మాగారంగా ఎన్‌టిఆర్ స్టేడియాన్ని తీర్చిదిద్దుతామని ఎన్‌టిఆర్ స్టేడియం కమిటి ఉపాధ్యక్షుడు మాజీ మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో స్ట్రాంగ్ మాన్ ఆఫ్ సౌత్ ఇండియాగా నిలిచి బంగారు పతకం సాధించిన పెద్ది జాన్‌బాబును అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా యలవర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల తమిళనాడులోని సేలంలో జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ఎన్టీఆర్ స్టేడియం లిఫ్టర్ పెద్ది జాన్‌బాబు అన్ని విభాగాల్లో కలిపి 617 కిలోల బరువును ఎత్తి బంగారు పతకం సాధించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో స్టేడియం సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, కోచ్ మారెళ్ళ వెంకటేశ్వరరావు, స్టేడియం మేనేజర్ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

సాంప్రదాయాలను భావితరాలకందించాలి

హస్తకళా ప్రదర్శనలో రాష్ట్ర చేనేత, జౌళి శాఖ కమిషనర్ జి.రేఖారాణి

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : హస్తకళాభిమానులకు నాణ్యమైన కళాత్మక ఉత్పత్తులను అందించడంతో పాటు కళాకారులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల్లో రూపొందించిన హస్తకళా ఉత్పత్తులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి ప్రదర్శన, అమ్మకాలు నిర్వహిస్తున్నట్లు చేనేత, జౌళి శాఖ కమిషనర్ జి.రేఖారాణి తెలిపారు. కేంద్ర టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ ప్రాయోజికత్వంతో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని మేరీస్ స్టెల్లా ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న లేపాక్షి గాంధీ శిల్ప్ బజార్‌ను బుధవారం కమిషనర్ రేఖారాణి సందర్శించి, హస్తకళా ఉత్పత్తులను స్వయంగా కొనుగోలు చేశారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన హస్తకళాకారులతో ఆమె ముచ్చటించి, వారు రూపొందించిన ఉత్పత్తుల తయారీ విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మన దేశం ప్రాచీన హస్తకళలు, ఘనమైన సంస్కృతీ సంప్రదాయాలకు ఎంతో ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. అనేకమంది హస్తకళాకారులు వారి కళా నైపుణ్యంతో రూపొందించిన కళాత్మక ఉత్పత్తులను నేటితరం ఆదరించడం అభినంద నీయమన్నారు. నరసాపురం లేస్ అల్లికలకు భౌగోళిక గుర్తింపు (జీఐ) ట్యాగ్ లభించడం ఆనందం కలిగిస్తుందన్నారు. చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే చేనేత వస్త్ర ప్రదర్శనలను ఎంతగానో ఆదరిస్తున్నారని, అదేవిధంగా లేపాక్షి హస్తకళా ప్రదర్శనను కూడా ఆదరించి కళాకారులకు మరింత జీవనోపాధి కల్పించేందుకు వినియోగదారులు ముందుకురావాలని ఆమె కోరారు.

ఇప్పటివరకు రూ. 40 లక్షల అమ్మకాలు: ఎపి హెచ్‌డిసి లిమిటెడ్ ఎమ్‌డి ఎం.విశ్వ

ఏపీ హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ (ఏపీ హెచ్‌డీసీ) లిమిటెడ్ వీసీ, ఎండీ ఎం.విశ్వ మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన ప్రారంభమైన లేపాక్షి గాంధీ శిల్ప బజార్ ప్రజలను ఎంతగానో ఆకర్షిస్తోందన్నారు. ఇప్పటివరకు రూ. 40 లక్షల అమ్మకాలు జరిగినట్లు తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ వరకు ప్రదర్శన నిర్వహించడం జరుగుతుందని ఈ ప్రదర్శనలో టెక్స్‌టైల్స్, ఎంబ్రాయిడరీ, గ్రాస్ లీఫ్, ఇమిటేషన్ జువెలరీ, కార్పెట్స్, లెదర్ ఆర్టికల్స్, హ్యాండ్ బ్లాక్ ప్రింటింగ్, టై అండ్ డై చీరలు, ఉడ్ కార్వింగ్, లేస్ బ్యాగులు, డ్రెస్ మెటీరియల్స్, కొండపల్లి బొమ్మలు, బాటిక్ ప్రింట్స్ వంటి ఉత్పత్తులు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏడీ అపర్ణ లక్ష్మి, లేపాక్షి మేనేజర్ మహంకాళి సురేష్, హెచ్‌పిఓ గౌతమ్ పాల్గొన్నారు.

ఉత్పత్తులను పరిశీలిస్తున్న జి.రేఖావాణి

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ వినతి

ప్రజాశక్తి - విజయవాడ : మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి విజయవాడ నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించాలని మునిసిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశను కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాస్ యూనియన్ (సిఐటియు) నగర కమిటీ ఆధ్వర్యంలో ఇంజనీరింగ్ (వాటర్, పార్కు, వెహికల్ డిపో మెకానికులు, స్ట్రీట్ లైట్, టౌన్ ప్లానింగ్) కార్మికులకు జీతాలు పెంచాలని బుధవారం కలెక్టర్‌ను తన చాంబర్‌లో నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థలో వివిధ సెక్షన్లలో పని చేస్తున్న వేలాది మంది అప్కాస్ కార్మికులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కార్మికుడు పని ప్రదేశాల్లో మృతి చెందినా, అనారోగ్యం పాలయినా వారి కుటుంబాలను ఆదుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కూడా సెలవులుండవని అన్నారు. 25 సంవత్సరాలనుంచి ఇంజనీరింగ్ కార్మికులు చాలీచాలని జీతాలతో వారి కుటుంబాలను పోషించలేకపోతున్నారన్నారు. ఇంజనీరింగ్ సెక్షన్ కార్మికులకు జీతాలు పెంచాలని కోరారు. శానిటేషన్ పర్మినెంట్ 45 మంది కార్మికులకు వరదల సమయంలో నాలుగైదు రోజులు పనిలోకి రాలేకపోయిన ఒక నెల వేతనం ఇవ్వలేదని, ఆ వేతనం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మరణించిన కుటుంబాల్లోని పిల్లలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు. వర్కర్లకు పనిముట్లు సబ్బులు చెప్పులు కొబ్బరి నూనె యూనిఫామ్ అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కంప్యూటర్ సెక్షన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు రూ.15000 ఇస్తున్నారని వారి వేతనాలు పెంచాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్‌లోని తప్పులను సరిదిద్దేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ తన పరిధిలో ఉన్న సమస్యలు పరిష్కరించేలా విఎంసి అధికారులను ఆదేశించడంతో పాటు ప్రభుత్వం పరిధిలో ఉన్న వాటి విషయంపై ప్రభుత్వానికి లేఖ రాస్తానని హామీనిచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.జ్యోతిబసు, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.ప్రవీణ్, నగర కోశాధికారి డి.స్టీఫెన్ బాబు,నగర ఉపాధ్యక్షురాలు జే.విజయలక్ష్మి,వాటర్ సెక్షన్ బాధ్యులు దుర్గారావు, కృష్ణ, నల్లశీను, మహేష్, పార్క్ సెక్షన్ బాధ్యులు టీ చిన్న, వెంకట్రావు, వెహికల్ డిపో మెకానిక్ సెక్షన్ బాధ్యులు దుర్గాప్రసాద్, స్ట్రీట్ లైట్ సెక్షన్ బాధ్యులు సాంబశివరావు, రామారావు, నగర సహాయ కార్యదర్శి శీలం దాసు, శానిటేషన్ పర్మినెంట్ బాధ్యులు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాశీనాథ్, ప్రవీణ్, తదితరులు

పవర్ లిఫ్టింగ్ విజేతకు సన్మానం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని చెరువు బజారునకు చెందిన ముద్దా తిరపతమ్మ ఈ నెల 21 నుండి 24 వరకు తమిళనాడు రాష్ట్రంలో శేలంలో జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 63 కేజీల జూనియర్స్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఓవరాల్‌గా స్ట్రాంగ్ ఉమెన్‌గా నిలిచారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్యని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తాతయ్య తిరుపతమ్మను అభినందించారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ మాట్లాడుతూ వివిధ టోర్నమెంట్లలో పాల్గొనడానికి అన్ని విధాల, ఆర్థికంగా సహాయ సహకారాలు అందిస్తున్న ఎంఎల్‌ఎ శ్రీరాం తాతయ్యకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాళ్లూరి వెంకటేశ్వర్లు, గుడిసె నాగేశ్వరరావు, గాలం శ్రీను, చిలుకూరి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డిజిటల్ స్మార్ట్‌బోర్డులు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : 100 ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వై4డి ఫౌండేషన్ సహకారంతో హిందూస్తాన్ కోకా-కోలా బెవరేజెస్ (హెచ్‌సిసిబి) డిజిటల్ స్మార్ట్‌బోర్డ్‌లను ఏర్పాటు చేసినట్లు సంస్థ కమ్యూనికేషన్ ఆఫీసర్ హిమాన్స్ ప్రియదర్శి తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. హెచ్‌సిసిబి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా, పాఠశాలల్లో సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ఆధునిక విద్యా సాంకేతికతను సమగ్రపరచడం ద్వారా తరగతి గది అభ్యాసాన్ని మెరుగుపరచడం, ప్రధాన ఉద్దేశమని అన్నారు. ఇంటరాక్టివ్‌ను ప్రోత్సహించడం, దాదాపు 15 వేల మంది విద్యార్థులకు ఆకర్షణీయమైన అభ్యాస వాతావరణాలను ప్రోత్సహించడం ఈ కార్యక్రమ లక్ష్యమని తెలిపారు. తరగతి గదిలో సాంకేతికతను మిళితం చేయటం ద్వారా, కొత్తగా ఇన్‌స్టాల్ చేయబడిన స్మార్ట్ బోర్డ్‌లు ఇంటరాక్టివ్, ఆకర్షణీయమైన, డైనమిక్ లెర్నింగ్ వాతావరణాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు హెచ్‌సిసిబి చీఫ్ పబ్లిక్ అఫైర్స్, కమ్యూనికేషన్స్ సస్టైనబిలిటీ ఆఫీసర్ హిమాన్ష ప్రియదర్శి పేర్కొన్నారు.

పాఠశాలలో వినూత్న విద్యా బోధన

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : స్కూల్స్ ఎంగేజ్‌మెంట్ ప్రోగ్రామ్ ద్వారా లెర్నింగ్ మెథడ్ విద్యా విధానం 50 వేల మంది విద్యార్థులకు అందించాలని గతేడాది డిసెంబరులో నిర్దేశించిన ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని మెల్బోర్న్ విశ్వవిద్యాలయం విజయవంతంగా అధిగమించినట్లు ప్రోగ్రాం ఇన్చార్జి మైఖేల్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలను తెలిపారు. 2020 నుండి భారతదేశం అంతటా 150కి పైగా పాఠశాలల నుండి 70 వేల మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో చేరారన్నారు. ఎపిలోని ఐదు జిల్లాల్లోని వందకు పైగా ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించిందని మెల్‌బోర్న్ విశ్వవిద్యాలయం డిప్యూటీ వైస్ ఛాన్సలర్ (గ్లోబల్, కల్చర్ అండ్ ఎంగేజ్మెంట్) ప్రొఫెసర్ మైఖేల్ వెస్లీ వెల్లడించారు.

సౌత్ ఇండియా చెస్ పోటీలకు కెబిఎన్ విద్యార్థులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : దక్షిణ భారతస్థాయిలో త్వరలో జరగబోయే చెస్ పోటీలకు తమ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కె.బి.ఎన్. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి చెప్పారు. ఈ సందర్భంగా బుధవారం కళాశాలలో విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 22న కృష్ణా విశ్వవిద్యాలయంలో జరిగిన యూనివర్శిటీ స్థాయి అంతర కళాశాలలో పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించడం ద్వారా జాతీయస్థాయి మహిళలు, పురుషులు రెండు విభాగాల్లోనూ తమ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. తమిళనాడులోని వెల్ టెక్ యూనివర్శిటీలో జరిగే పురుషుల టోర్నమెంట్‌కు పి.జ్యోతికిరణ్, ఆర్. రఘువంశిబీ గీతం యూనివర్శిటీలో జరుగబోయే మహిళల టోర్నమెంట్‌కు ఎ.బిందుమాధవి ఎంపికయ్యారన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దిన కళాశాల వ్యాయామ విభాగాధిపతి డి.హేమచంద్రరావుకు అభినందనలు తెలిపారు. హిందూ హైస్కూల్ విద్యాసంస్థల కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎల్ రమేష్, డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు విద్యార్థులను అభినందించారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : ఎంబిఎ విద్యార్థులు వ్యాపార వేత్తలుగా ఎదగడానికి కావాల్సిన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆంధ్రప్రదేశ్ మైక్రో, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అసోసియేషన్ సెక్రటరీ ఎం.ఎస్.రామచంద్రరావు తెలిపారు. కొత్తపేటలో గల పీఎస్‌సిఎంఆర్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీ (ఆటోనమస్) మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం 'థింక్. క్రియేట్. సక్సీడ్ ఆసక్తి గల యువ వ్యాపారవేత్తలకు అవసరమైన కీలక నైపుణ్యాలు' అనే అంశంపై ప్రత్యేక సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ మైక్రో, చిన్న, మధ్య తరహా పరిశ్రమల అసోసియేషన్ (ఎపిఎంఎస్ఎంఇ) జనరల్ సెక్రటరీ ఎం.ఎస్.రామచంద్రరావు హాజరై ప్రసంగించారు. ఒయో హోటల్స్, మజుందార్ ఫార్మాస్యూటికల్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి విజయవంతమైన వ్యాపారాల ఉదాహరణలను ప్రస్తావిస్తూ, తగిన ప్రణాళిక, దృష్టి, కృషితో ఎలా ముందుకెళ్లవచ్చో వివరించారు. విద్యార్థులు అతిథి స్పీకర్‌ను ప్రశ్నలు అడిగి సమాధానాలను పొందారు. కాలేజీ ప్రిన్సిపాల్ శరవణ కుమార్, మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాధిపతి డాక్టర్ విజయ దుర్గా ప్రసాద్ అతిథిని ఘనంగా సన్మానించి, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఫ్యాకల్టీ సభ్యులు కూడా చురుకైన పాత్ర పోషించారు.

నరసాపురం హైస్కూల్ సందర్శన

ప్రజాశక్తి - విసన్నపేట : మండలం నరసాపురం గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం డివైఇఒ వెంకటప్పయ్య సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో సిబ్బంది పనితీరును పరిసరాలను, రిజిస్టర్లను పరిశీలించారు. అపార్ వ్యాప్ పనితీరును పరిశీలించి స్కూల్లోని విద్యార్థుల డేటా నమోదు పరిశీలించి మిగతా డేటాను త్వరగా పూర్తి చేయాలని ప్రధాన ఉపాధ్యాయురాలు శోభలతకు, సిబ్బందికి ఆదేశాలిచ్చారు.

అక్రమ తవ్వకాల ప్రాంతం పరిశీలన

ప్రజాశక్తి - జి.కొండూరు : మండలంలోని చెవుటూరు గ్రామంలో మంగళవారం అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పంది సాంబశివరావు, మండల కార్యదర్శి కొంక బాలకృష్ణ మాట్లాడారు. మంగళవారం అక్రమ గ్రావెల్ తవ్వకాలు జరిగిన ప్రదేశం సర్వే నెంబర్ 176/1లో గత ప్రభుత్వం పేదలకు నివేశ స్థలాల కోసం కేటాయించిందని దీనిలో భాగంగా పల్లంగా ఉన్న ప్రాంతాన్ని సుమారు 12 అడుగుల పైగా మెరకతో ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి చదును చేసిందని అన్నారు. ఇప్పుడు అధికార పార్టీ నేతలు కాంట్రాక్టులు దక్కించుకొని కనీసం పంచాయతీ తీర్మానం కూడా లేకుండా గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ గ్రావెల్ యథేచ్ఛగా తవ్వేస్తున్నారని అన్నారు. నిబంధనల ప్రకారం పంచాయతీ తీర్మానం అనంతరం పంచాయతీకి సిస్తు కట్టి తవ్వకాలు జరపాలని అలాంటిది గ్రామానికి ప్రభుత్వానికి వచ్చే ఆదాయానికి గండి కొడుతూ కాంట్రాక్టర్లు జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. సిమెంటు రోడ్ల నిర్మాణానికి అయ్యే ఖర్చు ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులతో చెల్లిస్తుందని, చాటుగా ఎందుకు తవ్వుతున్నారని మండిపడ్డారు. ఈ గ్రావెల్ తవ్వకాలపై అధికార పార్టీ నేతలపై స్థానిక ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతుందని వారన్నారు. ఇలా అనుమతులు లేకుండా తవ్వకాలు జరిగితే రెవెన్యూ అధికారులు వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

తవ్వకాలు జరిగిన ప్రాంతాన్ని చూపిస్తున్న నాయకులు

చింతల నర్వ సర్పంచ్ కోటయ్య మృతి

ప్రజాశక్తి - గంపలగూడెం : చింతల నర్వ గ్రామ సర్పంచ్ గద్దల జాను కోటయ్య (72) మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు, కుమారులు. జాన్ కోటయ్య కాంగ్రెస్ పార్టీలో నూ, ప్రస్తుతం వైసిపి లోనూ నాయకుడిగా చురుకైన పాత్ర పోషించారు. గత కొంతకాలంగా, ఇబ్బంది పడుతూ బుధవారం సాయంత్రం మృతిచెందారు. మృతదేహాన్ని పలువురు నాయకులు అధికారులు సందర్శించి, ఘనంగా నివాళులర్పించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.